# గమ్యం

రాళ్లగుట్టలు రెండూ మబ్బుల్ని అందుకోవాలని పైకెగిరి అందుకోలేక కుప్ప కూలిన నెమళ్లలా కనిపిస్తున్నాయి. విచ్చలవిడిగా విచ్చుకున్న పింఛాల్లా మామిడి తోటా, చెరకు తోటా గుట్టల సానువుల నుంచీ పరుచుకున్నాయి.

మూడెకరాల మామిడి తోట, దాని కానుకునే రెండెకరాల మడి, ఆ పక్కనే లేదోట - మొత్తం యేడెకరాల భూమి. తూర్పూ, వుత్తర దిక్కుల్లో యెల్లలుగా రెండు చిన్న రాళ్ల గుట్టలు, పడమటివైపున చిన్న మట్టి బాట, దక్షిణంలో సన్నటి.కొండ నారవ. అటువైపున అవతలివాళ్ల చేన్లూ, తోటలూ...

సాయంకాలం కావస్తున్నా యెండలో తీవ్రత తగ్గలేదు. నీడలు మాత్రం లేతబడుతూ సాగుతున్నాయి.

మడికి ఆగ్నేయ మూలలో అయిదార్సు పవరు మోటారు పెట్టె గంగమ్మవాడి జాటీలా కర్ణకఠోరమైన శబ్దాల్ని ప్రసారం చేస్తోంది. అయిదారడుగులు పెరిగిన చెరుకు తోటలో నీళ్లు కడుతున్నాడు రెడ్డెప్ప. చెరుకును గుములు చుట్టి రెండు మూడు వారాలు గడిచినట్టుంది. అప్పుడప్పుడూ చేతిలోని పారను పక్కనపెట్టి, గుముల్లోంచీ విడివడి గాలిలో వూగుతున్న సోగ చెరుకుల్ని గుముల్లోకి చేర్చి ఆకులు చుడుతూ, నీటి కాలువలో నడుస్తున్నాడతను.

దాదాపు అయిదున్నర అడుగుల పొడవున్న నల్లటి ఆకారం అతడిది. నలభై యేళ్లయినా రాకమునుపే సంక్రమించిన బట్టతల. మిగిలిన వెంట్రుకల్లో సైతం యెక్కువ శాతం తెల్ల వెంట్రుకలే! మోకాళ్ల వరకూ పైకెత్తి కట్టుకున్న పాత గళ్లలుంగీ తప్ప వొంటిమీద ఆచ్ఛాదనేమీ లేదు.

రెండు కాళ్లూ వెడల్పుగా చేసుకుని, గెనిమలు తిప్పి యెడకాలవ తిప్పుతూ అతను కాలువలో ముందుకు కదులుతుంటే చిక్కిన బావురుకప్ప ఎగిరి ముందుకు గెంతుతున్నట్టే

వుంది. యెంత మెల్లగా నడుస్తున్నా నీళ్లు తొందరగా సాగడం లేదు. విసుగ్గా పారను ఆవతలికి విసిరి, గుముల్లోంచీ బయటికొచ్చి వేరుగానే నిల్చుంటానని మొరాయిస్తున్న చెరుకు సోగను గుముల్లో యిమడ్చడానికి విఫలయత్నం చేసి, గసలు బోసుకుంటూ దూరంగా వచ్చి గట్టుమీద కూర్చున్నాడు రెడ్డెప్ప. లుంగీ మడతల్లో దోపుకున్న బీడీకట్టన్నూ, అగ్గిపెట్టెనూ పైకి తీసి బీడీ వెలిగించుకున్నాడు.

గుప్పుమని పొగ పీల్చకముందే పెద్దగా దగ్గు ముంచుకొచ్చింది. తమాయించుకోవడం కోసం పక్కకు తిరిగి దగ్గసాగాడు.

తెల్లగా సుళ్లు తిరుగుతున్న బీడీ పొగల కవతల ఆగంతుకుడొకడు కనిపించగానే వులిక్కిపడ్డాడతను.

నడుము వరకూ పంచగానూ, తరువాత అంగవస్త్రంగానూ వొంటికి చుట్టుకున్న కాషాయరంగు యేకవస్త్రంలోంచీ నిగనిగలాడుతున్న ఆగంతుకుడి శరీరం పందిరిలోంచీ వేలాడుతున్న సొరకాయని తలపిస్తోంది. ముఖ కవళికల్ని కప్పిపెడుతున్న పొడవాటి తెల్ల గడ్డం. సగానికి పైగా బట్టతల. వెనకున్న జుట్టు భుజాలపైన పడుతోంది. నుదుటిపైన పెద్ద పెద్ద విభూతి రేఖలు. ముక్కుపైన, రెండు కనుబొమలకూ మధ్య పెద్ద కుంకుమబొట్టు. మెడలో రుద్రాక్షమాలలు రెండు.

''నువ్వు కాల్వలో నడస్తా వుంటే చెరుకు తోటకు నీళ్లు కడతా వున్నట్టు లేదు. ఆ నడకా, ఆ తీరూ చెరువులో చేపలు పట్టే వాడి మాదిరిగా కనిపిస్తావుండావు!'' యేమంటావన్నట్టుగా నవ్వసాగాడతను.

బీడీ దమ్ము మరోసారి లాగి వో పొడి దగ్గు దగ్గి, తననలా హడలగొట్టిన వ్యక్తి వైపునకు చికిలి చూపులు సారిస్తూ, ''యెవ్వరు సామీ నువ్వు? యిట్లెందుకొచ్చినావు?'' అన్నాడు రెడ్డెప్ప.

పొలం గట్టుపైన, చెరుకు తోట నీడలో కూర్చుంటూ, ''చెరుకు గుములు చుట్టి పోయినోడెవుడో పలాతనమైనోడుగా వుండాడు. అరాకొరగా పని చేసి పోయినాడు. నువ్వు ధగ్గిర కాపెట్టుకోనుండలేదా?'' అని అడిగాడు స్వామి.

అతడివైపోసారి తేరిపార జూసి, ''చూస్తే చానా సేపుట్నించీ యీడ నిలబడుకో నున్నట్టుండావు. యెంత సేపయింది సామీ నువ్విట్లొచ్చి? యీడ నీకేం పని?'' అంటూ విసుక్కున్నాడు రెడ్డెప్ప.

చుట్టూ కలయజూసి ''లేదోట గూడా బాగానే తయారయ్యింది. నాలుగేండ్లయిందా మామిడి చెట్లు నాటి?'' అని ప్రశ్నించాడతను.

రెడ్డెప్ప సమాధానం చెప్పలేదు.

స్వామి కూడా కాస్సేపు మౌనంగా వుండిపోయాడు. తరువాత బిగ్గరగా నిట్టూర్చి, ''యిప్పటి కథగాదు. నలభై యాభై సంవత్సరాల సంగతి. యీ తావులో యిక్కడ్నే, యీ గుట్టల పక్కన యిప్పుడు నువ్వు పార పట్టుకోని నీళ్లు పారగట్టిన చోటులో నేనుగూడా

సేద్యం చేసినానులే! అప్పటికి నువ్వు పుట్టుండవు... అది సరేలే! నువ్వు వెంకట సిద్దయ్య కొడుకేనా? లేకపోతే...'' అంటూ పరకాయించి చూడసాగాడు.

యెదుటి వ్యక్తి దారి తప్పి వచ్చిన బాటసారి కాదన్న విషయం తెలిపోవటంతో బీడీ పీకను అవతలికి గిరవాటు పెట్టి ''కొడ్డుకేలే! నువ్వెవురో చెప్పు, సామీ! నిన్నీ యిలాకాలో నేనెప్పుడూ చూడలేదు'' అన్నాడు రెడ్డెప్ప.

''మీ నాయనకు పెండ్లయిన కొత్తలో యెప్పుడో వెళ్లిపోయినవాణ్ని, నిన్న సాయంత్రం మల్లా అడుగుపెట్టినాను. నీకు నన్నెట్ల తెలిస్తోందిలే! భవబంధాలు తెంచుకుని సన్యాసదీక్ష తీసుకోని వెళ్లిపోయిన తర్వాత యీ పక్కకు రావడం యిదే!'' యెటో చూస్తూ మాట్లాడుతున్నాడు స్వామి.

రెడ్డెప్ప మరోసారి వులిక్కిపడ్డాడు. వొక్కసారిగా అతడి చేతులపైన వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. వున్నట్టుండి పెద్దగా దగ్గు ముంచుకొచ్చిందతడికి. అతికష్టం పైన గొంతు పెగల్చుకుని ''కొంపదీసి... నువ్వు మా నాయన తమ్ముడేనా యేంది?'' అంటూ మాటలు కూడబలుక్కుంటూ ప్రశ్నించాడు.

మీసాలు సాగడం ద్వారా, గుబురు గడ్డం అటూ యిటూ విడివడటం ద్వారా స్వామి చిరునవ్వు నవ్వుతున్నాడని తెలుస్తోంది.

''యెప్పుడో యిల్లొదిలిపెట్టి సన్యాసుల్లో చేరిపోయిన మా చిన్నాయన గురించి మావోళ్లు కతలు కతలుగా చెప్తావుంటే విన్నాను. అసలు చానా సమత్సరాల ముందొకసారి యెవురో యెక్కడో సమారాధనలో కనబడినాడని కూడా మాతో చెప్పినారు. ఆ మధ్యొకసారి యెవురో ఆ మనిషి యింకా ఎక్కడ బతికుండాడులే అని తేల్చిపారేసినారు!'' మాట జారిన తర్వాత అతను నాలిక్కరుచుకున్నాడు.

''గుండు మాదిరి యింకా దిట్టంగా వుండాను. నన్ను చూసినాక గూడా నమ్మకం కుదర్లేదా నాయనా?'' అదోలా నవ్వసాగాడు స్వామి. ''దేశమంతా సంచరం చేసేసినానులే! గండి దగ్గిర ఆత్మానందాశ్రమంలోనే వుండిపోయినాను చానా దినాలుగా!''

రెడ్డెప్ప అనుమానంగానే చూడసాగాడు.

''సన్యాస దీక్ష తీసుకున్న కొత్తలో వొక అయిదేండ్లు మా గురువుతో బాటూ వుత్తరదేశం పొయ్యుంటిని'' అరమోడ్పు కన్నులతో చూస్తూ చెప్పసాగాడు స్వామి. ''కాశీ, హరిద్వారం, ప్రయాగ, అన్నీ తిరిగి బీహారులో వొక ఆశ్రమంలో కొన్ని సంవత్సరాలుంటిని. తమిళనాడులో తంజావూరు దగ్గిర కొన్నేండ్లు, రావూరు అన్నపూర్ణాశ్రమంలో కొన్నేండ్లూ వుండిపోతిని. గండి ఆంజనేయస్వామి ఆజ్ఞ యిస్తే అక్కడికి పోతిని. అక్కడ్నే మా గురువు నిరంజనాశ్రమం స్థాపిస్తే దాన్లోనే గడిపేస్తిని యిన్ని దినాలుగా. పోయిన శ్రావణ పౌర్ణమినాడు మా గురువు శాశ్వత సమాధిలోకి వెళ్లిపోయినారు. ఆయన లేని చోటులో వుండే దానికి యీ జీవుడికి ఇష్టం కలగలేదు. అప్పటినుంచీ ఆ ఆశ్రమమూ, యీ ఆశ్రమమూ అని లేకుండా తిరగతా వుండాను''

''మా అవ్వ పోయినప్పుడు కూడా రాలేదంట!'' యెదుటి వ్యక్తి అసలైన ఆచూకీ కనిపెట్టడం కోసం క్రాస్ యెగ్జామినేషన్ మొదలుపెట్టాడు రెడ్డెప్ప.

''తల్లీ, తండ్రీ యీ దేహానికే నాయనా! అసలైన ఆత్మకు తల్లీ, తండ్రీ, గురువూ దైవం అన్నీ ఆ పరమాత్ముడే! ఆయన కంటిలో పడినాక యింక బతుకంతా ఆయన ధ్యానంలోనే! మన చేతుల్లో యేముంది? అంతా మాయ!''

పెద్దగా శబ్దం చేస్తూ మిషను ఆగిపోవడంతో స్వామి మాట్లాడటం మాని, పూర్తిగా కళ్లు తెరిచి చూశాడు.

రెడ్డెప్ప వెనుదిరిగి చూసి, ''కరెంటు పోయింది వుళ్లా!'' అంటూ పైకి లేచి, దగ్గుకుంటూ మిషను వైపు నడవసాగాడు. స్వామి కూడా అతడినే అనుసరిస్తూ పొలం గట్టుపైన నడవసాగాడు.

''మిషను బిగించి యెన్ని దినాలయింది?'' అని ప్రశ్నించాడతను.

''మూడేండ్లయింది. ఆ మూలలో జియాలజిస్టు నాలుగు పాయింట్లు పెట్టించినాడు. సమత్సరాని కొకటిగా మూడుచోట్ల బోరింగేయించినాను. దగ్గిర దగ్గిర నలభై వేలు నష్టం. కడాకు యీ పాయింటు దగ్గిర జలపడింది. వానాకాలంలో వొక మాదిరిగానే వొస్తాయి నీళ్లు. ఆపైన యీ మాదిరిగా నాలుగేళ్ల యెడంతో పారతాది. నీళ్లు వూరేది తక్కువ. అప్పుడప్పుడూ ఆపీ ఆపీ మిషనెయ్యాల. దానికి తోడు యీ కరెంటుతో పెద్ద యాతన. యెప్పుడొస్తిందో, యెప్పుడు పోతిందో తెలియదు. రాత్రీ పగలూ యిక్కడ్నే కాపెట్టుకోని కరెంటొచ్చినప్పుడు నీళ్లు పారగట్టుకోవాల. కరెంటు సరిగ్గా లేక, నీళ్లూ సరిగ్గా రాక, నెల దినాలకు ముందొకసారి తోట యెండి పోతిందని ఆశలొదిలేస్తిని. వొక పదును వాన కురవడంతో బతికిపోయినాం!'' మిషను స్విచ్ ఆఫ్ చేశాక వెనుదిరిగాడు రెడ్డెప్ప.

దుబ్బుగా పెరిగిన కనురెప్పల కింద పదునైన చూపుల్ని సారిస్తూ ఆగంతుకుడి కళ్లు రెండూ తనను నఖశిఖ పర్యంతరం పరీక్షించి చూస్తున్నట్టు గమనించగానే రెడ్డెప్ప తడబడిపోయాడు.

''మీ నాయన వూళ్లో లేడా?'' అడిగాడు స్వామి.

''లేడు. హొస్పేటకు పోయినాడు!'' రెడ్డెప్ప చెప్పాడు.

''యెక్కడికి కర్ణాటకలో బళ్లారి దగ్గిరుండే హొస్పేటకేనా?''

తల వూపాడతను.

''అంత దూరంలో యేం పని?''

''మామిడికాయల వ్యాపారం. పోయి రెండు నెలలయింది. యింకా రెండు మూడు నెలలక్కడే వుండాల!''

''మీరు యెందరు సంతానం?''

''ముగ్గురు మొగోళ్లు, యిద్దరు ఆడోళ్లు. మా అక్కకూ, చెల్లికి పెండ్లిండయి పోయి

చానా సంవత్సరాలయి పోయింది. అక్కను దిగవపల్లెలో ఇచ్చినాం. చెల్లెని యీ కొత్తూరు లోనే అయినోళ్లకే యిచ్చినాం. మా అన్న, రాజగోపాల్‌కు కువాయిట్‌లో వుద్యోగం. నా కంటే చిన్నోడు, రామచంద్రయ్య చిత్తూరులో వుద్యోగం చేస్తా వుండాడు - క్లర్కు.''

''అందరికీ పెండ్లిండ్లయినాయా, నాయనా?''

''మా రాజగోపాలన్న భార్యాబిడ్డలిద్దరూ వాళ్లత్తగారిల్లు పాకాల చేరిపోయినారు. ఆయన ఒంటిగా వుద్యోగం పైన కువాయిట్‌కు చేరి అయిదారేండ్లవతా వుంది. అప్పటినుంచీ నెల నెలా దుడ్లు పెండ్లానికే పంపిస్తా వుండాడు. ఆమె ఆ దుడ్లు దగ్గిర పెట్టుకోని కొడుకులిద్దర్నీ చదివించుకుంటా వుంది. మా తమ్ముడు పెండ్లాడింది అరగొండలో. కాపరం చిత్తూరులోనే. వాడికీ యిద్దరూ కొడుకులే! కాన్వెంటులో చదవతా వుండారు. యీ పల్లె కొంపల్లో వుండే గుడిసె స్కూల్లో చదవాలని నా బిడ్డలకూ, యీ మట్టిలోనే పొర్లాడాలని నాకూ రాసి పెట్టి వుంది!'' మరో పెద్ద దగ్గు తెర ముంచుకురాగా చివర్లో అతడి గొంతు కీచుకీచుగా పలికింది.

''నువ్వు కూడా బాగా చదువుకోని వుద్యోగం చేసుకోనుంటే యెవురొద్దన్నారు?'' నిర్వికారంగా ప్రశ్నించాడు స్వామి.

''నేనూ చదివాన్లే యెమ్మే దాకా! వుద్యోగం రావాలంటే చదువుంటే సరిపోతుందా?'' మౌనం బెరుకుతనాన్ని పెంచుతోందని అర్థం కాగానే రెడ్డెప్ప మరింత విపులంగా వివరించసాగాడు - ''బియ్యెడీ చేస్తే బిన్నాగా వుద్యోగమొస్తిందని అందురూ అంటా వుంటే అణ్ణామలై యూనివర్శిటీకి కరెస్పాన్డెన్సు కోర్సు కట్టయి చేసినాను. వొక సంవత్సరం కోర్సు మూండేడ్లు సాగింది. ప్రయివేటుగా యెమ్మే చేస్తే అది మూడేండ్లకు నీల్గింది. యింతలో మనకేమో పెండ్లిమీద ధ్యాస మల్లింది. పెండ్లయినాక యింక చదువులూ సాములూ అచ్చిరాలేదని యీ మట్టి పిసుక్కునే పనిలోకి దిగేసినాను!'' ఖణేళ్ ఖణేళ్‌మని దగ్గుతూ తన మాటల్ని పూర్తిచేశాడు రెడ్డెప్ప.

ధోరణి మరల్చడం కోసం ''యీ మడిలో చెర్కుకెందుకేసినావు? వరి నాటకూడదా?'' అని అడిగాడు స్వామి.

''పోయినసారి వరి పైరే బెట్టినాను సా... మీ...! అదేందో కొత్త వంగడమొచ్చింది. బాగా ఫలితమొస్తాదని అందురూ అంటే అదే నాటితిని. సరిగ్గా నీళ్లు లేక సగం పంటే చేతికొచ్చింది. అందుకని యీసారి చెరుకేసినాను. అసలు యీ బోరింగేయక ముందు యిక్కడంతా చేనే చేస్తా వుంటిమి. నాల్గైదేండ్లు చెనిక్కాయ లేసినాము. పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఆదాయం చానా తక్కువ. వొక సంవత్సరం మల్బరీ చెట్లు పెంచి పట్టు పురుగులు కూడా పెంచినాను. యీ ఎండలకు తట్టుకోలేక పురుగులు మాడిపోయినాయి. అయిదారు వేలు నష్టం. వొకసారి పొద్దు తిరుగుడు పూల పంట పెట్టినాను. అనుకున్నంత వ్యారుమానం రాలేదు. యింక యిట్లా కాదని యీసారి చెరుకేసినాను. మిల్లుకు తోలే దానికంటే గానిగాడిస్తే లాభసాటని వాళ్లూ వీళ్లూ చెప్తావుండారు. నేనింకా యేమీ

అనుకోలేదు''

మామిడి తోటలోకి అడుగు పెట్టారిద్దరూ.

''నాకు తెలిసి యిన్ని చెట్లు లేవు. కాత బాగానే వుంది కదా యీసారి?'' చుట్టూ కలయజూస్తూ అడిగాడు స్వామి.

''అయిదారేండ్లుగా యెవురికీ తోట అమ్మడం లేదు. యిప్పుడు మా నాయనే వ్యాపారం మొదలుపెట్టినాడు గదా! నేనే దగ్గిరుండి మందులు కొట్టించినాను. మంచు పురుగులు సంగపూతను తినేసినాయి. అర్ధపంటే నిలిచింది. యీ సంవత్సరం యేం చూసినావులే! పోయిన తడవ భలే పంట! కాయల బరువుకు తట్టుకోలేక కొమ్మలే యిరిగిపోయినాయి. కానీ యేం లాభం? రేటు లేదు. అంతకుముందు తడవ అయిదు టన్నులే వచ్చింది పంట. బ్రహ్మాండమైన రేటు. యీసారి పది టన్నులకు తగ్గదని మతిం పేసినాను. అంతా పూతా, పిందెగా వుంది. యింకా కొన్ని దినాలు పోతేకానీ యే సంగతీ చెప్పలేం!''

''చెట్లకు సరిగ్గా నీళ్లు కట్టేటట్టే లేదు. పాదులు చేసిన ఛాయలు కూడా కనిపించడం లేదే!'' అడ్డుతగులుతూ అడిగాడు స్వామి.

''చెరుకు తోటకే నీళ్లు చాలడం లేదు. యింక మామిడి చెట్లకెక్కడ నుంచి తెచ్చేది?'' విసుక్కున్నట్టుగా సమాధానం చెప్పాడు రెడ్డెప్ప.

''యీ పక్క నొక బంగినపల్లి మామిడి చెట్టుండాల... యెక్కడది?'' స్వగతంలా గొణుక్కున్నాడు స్వామి.

''యిదే గదా!'' వో చెట్టు ఆకులు పట్టి చూపుతూ అన్నాడు రెడ్డెప్ప.

స్వామి అతడినోసారి యెగాదిగా చూసి, ''యిది పీతర్! బంగినపల్లంటే యీ పక్క బేనీషా అంటారు. దాని ఆకులు యిట్లుండవు. లావుగా, పొడుగ్గా వుంటాయి'' అంటూ నవ్వాడు. ''అప్పటినుంచీ చూస్తా వుండాను. నువ్వీ వ్యవసాయానికి లాయికీగా కనిపించడం లేదు. సమత్సరానికొకసారి పంటల్ని మార్చి అదృష్టం లెక్కబెట్టుకుంటే గుణం లేదు. చేసే పనిమీద మనసు పెట్టి చేస్తే యేదైనా కలిసొస్తింది!''

నడుస్తున్న వాడల్లా ఆగి నిల్చుని, వెనుదిరిగి నడుముపైన చేతులుంచుకుని ''యీ పక్క నాకంటే బాగా సేద్యం జేసేవాణ్ని చూపించు సామీ నీ వల్లయితే!'' అని హూంకరించాడు రెడ్డెప్ప. ''యీ పక్క నా మాదిరిగా చదువుకోని సేద్యానికి దిగిన మొగోడే లేడు. అంతా మొరటు రకం. వేలిముద్దర్ల మనుషులు. యీ యిలాకాలో తొలిసారిగా పొద్దుతిరుగుడు పూలు నాటిందెవురు? నేనే! చూస్తా వుండు. యీ చెరుకు తోట కొట్టేస్తానే తక్కాళి తోట పంటబెడతాను. యీసారి టవున్లో కేజీ టమేటోలు యెంతో తెలుసునా? యిర్వై అయిదు రూపాయలు. యీసారితో దరిద్రం తరిపోకపోతే అప్పుడడుగు నన్ను! ఆ వీడీవో కొత్తగా యేదో మందొచ్చిందన్నాడు. దాన్ని కొడ్తే టమాటోలు విరగకాస్తాయని చెప్తావుండాడు. యీ పదేండ్లుగా యీ రెండెకరాల మడితో నేనాడని ఆట లేదు. యీ యేడెకరాల తావులో నా చెమట చిందని చోటు లేదు. బాంచెత్! లోపం నాలో లేదు పెద్దాయనా! యీ

తావులోనే వుంది. యిన్ని దినాలుగా అగసాట్లు పడతా వుండాను గదా! కష్టం జాస్తి, ఫలితం కొంచెం. ఆ మామిడి తోపులో చెట్లు బాగా ముసిలివై పోయినాయి. కొట్టేద్దామంటే పెద్ద పెద్ద గట్లు గదా అని మినకరిస్తా వుండాము. ఆ లేదోటలో చెట్లు నాటి ఆరేండ్లయి పోయింది. చెట్లు సరింగా ఎదగడం ల్యేదు. కన్నగసాట్లూ పడి బోరింగేసి చేనును మడిగా తీరిస్తిని. యేం లాభం కనపడ్డం లేదు. అయినా యిదిగాదు దోవ. యీ మధ్యనే కొత్తగా వొక అయిడియా యేసినాను. చూస్తా వుండు యేం చేసి పారేస్తానో!''

కుతూహలాన్ని వీలైనంతగా తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూ ''యేం చేస్తావు?'' అని ప్రశ్నించాడు స్వామి.

''మంచి బేరం తగిలితే దొంగ ల్దోలిపారే ద్దామనుకుంటా వుండాను.''

''యేదైనా వ్యాపారంలోకి దిగదామనా?''

''నేనంత బిన్నాగా చేతులెత్తేసేవాణ్ని గాదులే సామీ!'' నవ్వుతో బాటూ దగ్గూ కలిసి రాగా గొంతు రాసినట్టుగా మాట్లాడసాగాడతను.

''యీ వ్యవసాయమో, నేనో - యేదో వొకటి తేలిపోవాల. మా బామ్మర్ది వాళ్లుండేది కాళాస్త్రి కాడ కృష్ణాపురం. అక్కడ భూములు భలే అగ్గవ. వానలు బాగా జాస్తి! కాలవల్లో, చెరువుల్లో నీళ్లెప్పుడూ వుంటాయి. బాగా నిమ్మళమైన భూములు. యిక్కడ అమ్మిన దుడ్డుతో అక్కడ యింకా పెద్ద కయ్య కొనుక్కోవచ్చు. బేరానికి పెట్టేయాలని యింకా నాయనకు చెప్పలేదు. ఆయనెప్పుడూ యీ భూమి బుర్రా అంటే పెద్ద రోత. వొద్దనడని నాకు తెలుసు''

తోట దాటి రాళ్లగుట్ట దగ్గరికొచ్చినాక చిన్న వేప చెట్టు నీడలో పెద్ద బండపైన కూర్చున్నా రిద్దరూ. యెండలో కాగిన బండలు యింకా వేడిగానే వున్నాయి. తోటలోంచి యేవేవో పక్షులు కీచుకీచు గొంతుకలు వినవస్తున్నాయి. దూరంగా యేదో గూడ్సు రైలు పట్టాల్ని మేల్కొల్పుతూ పరుగెతుతోంది. పడమటి కొండల కిందుగా జారిపోబోయే ముందు సూర్యుడు వోసారి వెనుదిరిగి సాగి వచ్చిన దూరాన్ని పరిశీలిస్తున్నాడు.

''మీ అన్నదమ్ములందురూ అమ్మే దానికి వొప్పుకుంటారా?'' స్వామి అడిగాడు.

''వాళ్ల అభ్యంతరమేముంటాదిలే సామీ! మా అన్నకు కువాయిట్‌లో మంచి సంపాదన. ఆయన్నెక్కడ దుడ్డడగతామో అని ఆయన భయం. మా తమ్ముడు టౌనొదిలిపెట్టి క్షణం బతకలేడు. యీ పల్లె కొంపలంటేనే వాని కంపరం. వాళ్లిద్దరికీ సేద్యాలేమీ కాబట్టవు!'' అన్నాడు రెడ్డెప్ప.

కాస్సేపు ఆలోచించి, ''వాళ్లొప్పుకోకపోతే యేం చేస్తావు?'' అని అడిగాడు స్వామి.

''వొప్పుకోకపొయ్యే దానికి వాళ్లెవురు?'' కోపంతోనూ, దగ్గుతోనూ వుక్కిరిబిక్కిరవుతూ రెడ్డెప్ప శివమెత్తిన వాడిలా వూగిపోసాగాడు. ''యీ నేల వూరికే దిక్కులో వుందనయినా వాళ్లకు తెలుసునా? వొక దినమైనా వాళ్లిద్దురూ యీ నేల దగ్గరికొచ్చి నిలబడినారా? కూడా పుట్టినంత మాత్రాన వాళ్లకు కూడా అధికార మొచ్చేస్తిందా? యింతకాలం యీ నేలలోనే

పడి దుమ్ముగొట్టుకు పోయి నోడికంటే వాళ్లేమైనా గొప్పోళ్లా?''

అయిదారు నిముషాలు గడిచినా రెడ్డప్పకు గసబుసలు తగ్గలేదు. బీడీ రగిలించి గబగబా పొగ పీల్చి వదిలిపెట్టసాగాడు. కొంచెం తెప్పరిల్లిన తర్వాత మెల్లగా మొదలెట్టాడు - ''మా అన్న కువాయిట్‌కు పంపించే దానికి ఆ దినాల్లోనే యాభైవేలయింది. మా తమ్ముడికి వుద్యోగం తీసిచ్చే దానికి అర్వై వేలయింది. అంతా వుమ్మడి ఆస్తే గదా? ఆ మాత్రం ఖర్చు నాపైనా పెట్టుంటే నేనూ సిల్కు చూక్కా యేసుకోని, స్కూటరెక్కి వొయ్యారంగా ఆఫీసుకు పోయి గంట గొట్టంగానే బయటికొచ్చి, నెలకు ముప్పయి దినాలు లెక్క బెట్టుకోని, జీతం దుడ్డు జేబులో యేసుకోనుందును గదా! మా నాయన కూడా వలపక్షం పెట్టుకోకుండా వాళ్లను జూసిన కంటితో నన్నూ చూసుంటే, యీ పల్లె కొంపల్లో కూరుకపోవాల్సిన గాచ్చారం నాకూ తప్పుండును. అసలు ఆ పల్లెలో వుండేదానికంటే యీ తోటలోనే ఇల్లు కట్టుకోవుంటే బాగుండును. కాళ్హాస్త్రి కాడ కయ్యి కొనుక్కున్నాక తోపులోనే యిల్లేసుకోవాలను కుంటా వుండాను. అప్పుడుగానీ సేద్యం సుఖం గాదు!''

అంతవరకూ కొడిగట్టిన దీపాల్లా వెలవెలబోయిన అతడి రెండు కళ్లూ వున్నట్టుండి తీక్షణంగా వెలగసాగాయి. దూరంగా పడమటి కొండల సానువుల కవతల దేన్నో అతడి చూపులు వెతుకుతున్నాయి. యేదో కొత్త శక్తి ఆవరించినట్టుగా అతడి శరీరమంతా వణకసాగింది. కంపిస్తున్న గొంతుకతో, తనతో తానే మాట్లాడుకుంటున్నట్టుగా అతడు చెప్పుకుపోసాగాడు - ''నీళ్లతో నెమ్మెక్కి శాంతంగా వుండే మడి చెక్క రెండెకరాలు. యిర్వై నాలుగ్గంటలూ కొట్టినా వేలి వాసమయినా తగ్గని బోరింగొకటి. సక్రమంగా దున్ని పాదులు జేసి నీళ్లు గట్టిగా మంచి కాత గాసే మామిడి తోట అయిదెకరాలు, గొడ్డూ గోదా... వానొచ్చినా వంగడొచ్చినా బయం లేకుండా యిల్లు... పెండ్లానికీ, బిడ్డలకూ కూడుకూ, గుడ్డకూ తక్కువ చెయ్యకుండా ఫలసాయం... యీ మాత్రం పనయినా యీ కట్టెలో శక్తి వుడిగే లోపల చేసి పెట్టి పోవాల. బిడ్డలు మా నాయన మాకేమీ తక్కువ జేసి పెట్టిపోలేదు అని పది కాలాలూ నా పేరు చెప్పుకోవాల. అంత వరకూ యేది యేమైనా యీ పట్టు వదిలేది లేదు, బాంచెత్! చూడాల, నేనో, యీ సేద్యమో! తేల్చిపారేయాల!''

అతడి పిడికిళ్లు బిగుసుకున్నాయి.

నుదుటిపైన ముడతల ముళ్లు చెదిరాయి.

చెవుల కిందుగా చెమట ధారొకటి గొంతువైపు సాగింది.

స్వామి అతడివైపే కళ్లార్పడం సైతం మరచిపోయి చూడసాగాడు.

యిద్దరూ అలాగే కాస్సేపు మాట్లాడుకోకుండా మౌనంగా చూస్తూ వుండిపోయారు.

తరువాత స్వామి పైకిలేచి, కాషాంబరానికంటుకున్న పల్లేరుగాయల్ని విదిలించుకుంటూ, ''నేను బయల్దేరతాను నాయనా! వయస్సు యెగబడింది గదా! చూపు కొంచెం మట్టమయింది. చీకటి పడకముందే ఆశ్రమం చేరుకోవాల. నడవాల గదా!'' అన్నాడు.

''ఆ పక్క దోవ సరిగ్గా లేదు సామీ! వుండు. నేనూ అంద్దాకా వస్తాను. యీ

కరెంటిప్పుడిప్పుడే వచ్చేట్టు లేదు. యీ పొద్దు రాత్రికి జాగారం తప్పేట్టు లేదు. నేనూ యింటికి పోయి రెండు మెతుకులు గతికేసి వస్తాను!'' అంటూ తానూ బయలుదేరాడు రెడ్డెప్ప.

''రాత్రికి మళ్లా వస్తావా? అయితే యింటికి పోయి పడుకునేదెప్పుడు?'' అని అడిగాడు స్వామి.

''పదైద్దినాలుగా రాత్రుల్లో మన పడక యీ తోటకాడనే గదా! యింకో వారం దినాలు కాపెట్టుకోనుండాల. యీ గుట్ట దగ్గిర గుంతనక్కల పోటుకు జాస్తి. యేమారితే గుములు గుములుగా చప్పరించి పారేస్తాయి. రాత్రుల్లో తోడుగా వుండేదానికి సేద్యగాణ్ణి కూడా రమ్మన్నాను!'' మాట్లాడుతుండగానే రెడ్డప్పకు దగ్గు తోసుకొచ్చింది. దగ్గుతూనే బీడీ వెలిగించి, ''పొద్దన్నెప్పుడో యిట్లొచ్చేసినాను. మధ్యానం భోజనం తోట కాడికే వచ్చింది. కువాయిట్ నుంచీ మా అన్నొచ్చినాడని జాబొచ్చి రెండు దినాలయింది. యీ పొద్దో, రేపో యింటికి రావాల!''

''యిప్పుడెక్కడున్నాడు మీ అన్న?'' స్వామి అడిగాడు.

''యింకెక్కడ? వాళ్లత్తగారింట్లో! పాకాల కొచ్చి వారం దాటిందంట. కువాయిట్ నుంచీ వచ్చి పొయ్యి రెండు నెలలు కూడా కాలేదు. యీసారి సమత్సరానిగ్గానీ రానని చెప్పేసి పోయిన పెద్దమనిషి యింతలోనే తిరుక్కోనొచ్చినాడు. యేమైనా దుడ్డెక్కువగా దొరికితే పెండ్లానికిచ్చేసి పోదామని వచ్చుంటాడు!'' మట్టి బాట పైకొచ్చాక ఆగాడు రెడ్డెప్ప.

''నువ్వు యింటికిపోవాల గదా! నేనూ ఆశ్రమానికి పోతాను. యింకా కొంచెం వెలుతురుంది. వెళ్లి పోగలనులే! మీ అన్నొస్తే యిద్దరూ వొకసారి ఆశ్రమం దగ్గరికి వచ్చి పొండి. విమల ప్రకాశానంద స్వామి అని అడిగితే యెవ్వరైనా చూపిస్తారు!'' తన గమ్యం వైపు తిరుగుతూ చెప్పాడు స్వామి.

''విమల ప్రకాశానందస్వామా? అదెవురు?'' రెడ్డెప్ప విస్తుపోయాడు.

''నేనేలే! దీక్ష తీసుకున్నాక మా గురువు చిరంతానంద స్వాములవారు ఆ పేరు పెట్టినారు'' నడుస్తూనే సమాధానం చెప్పాడు స్వామి.

పెద్దగా దగ్గు తోసుకు రావడంతో నిలువునా కదిలిపోతూ ముందుకు కదిలాడు రెడ్డెప్ప.

పలచగా వ్యాపిస్తున్న చీకటి తెరల్లో రకరకాల ఆకారాల రాళ్లతోనూ, బొమ్మజెముడు పొదల్తోనూ భీకరంగా కనిపిస్తున్న రాళ్లగుట్టలు రెండూ యేదో అటవిక జాతి వాళ్ల దేవత ముఖంలా భీకరంగానూ, తోటా, పొలమూ ఆమె నోటిలోంచీ జారిన పచ్చని నాలుక లాగానూ చిత్రంగా కనిపిస్తున్నాయి.

## 2

తూర్పు కొండల వల లోంచీ సూర్యుడింకా బయట పడలేదు.

రాత్రంతా పర్వతాలు కన్న కలలకు ఆకారం వచ్చినట్టుగా ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు కదులుతున్నాయి.

మట్టి బాట దాకా నడచి వచ్చిన తర్వాత, మామిడి తోట కేసి తిరిగి నిల్చున్నాడు విమల ప్రకాశానంద స్వామి.

మామిడిచెట్ల గుబురుల్లోంచి రాళ్లగుట్టలు రెండూ తమకు ఆహారంగా మారబోయే చిన్న చిన్న జంతువులపైకి దుముకడానికి సిద్ధమౌతూ పొదల్లో నిక్కి కూర్చున్న క్రూరమృగాల్లా కనిపిస్తున్నాయి.

దాదాపు తన వయసున్న మామిడి చెట్లని చూపులతోనే పలకరిస్తూ తోటలోకి అడుగుపెట్టాడతను.

అక్కడక్కడా చెట్ల ఆకుల్లోంచీ చిన్న చిన్న పిందెలు తొంగి చూస్తున్నాయి. నీళ్లెండి పోయిన చెరువులా బోసిగా వుంది మడి. కాలి బుగ్గయిన చెరుకు మొదళ్లతో, ఆకులతో నల్లగా తయారైన మడి అవశేషాలు, కూలిన భవనపు శిధిలాల్లా వికృతంగా కనిపిస్తున్నాయి. తోటకొక చివర చిన్న గుడిసె లాంటి ఆశ్రయం కనిపించింది. దాని ముందొక చిన్న కుక్కిమంచం. దానిపైన కూర్చున్న వ్యక్తి కాషాయంబరదారిని చూడగానే తటపటాయిస్తూ పైకి లేచి నిల్చున్నాడు.

పొడుగ్గా, యెరుపో నలుపో తెలియని రంగుతో, యింకా చేవబారని కొయ్యతో చెక్కిన బొమ్మలా బలహీనంగా కనిపిస్తున్న ఆకారం అతడిది. విరిగిన చేతికి కట్టు కట్టుకుని, దానికో దారం కట్టి మెడకు తగిలించుకున్నాడు. తొడుక్కున్న సిల్కుబట్టలు, దారి తప్పి పొలానికి వచ్చాడేమో నన్న సందేహాన్ని కలిగిస్తున్నాయి.

అతడు పలకరిస్తాడేమోనని యెదుర్చూసి, విఫలుడై, చివరకు తానే ''రెడ్డెప్ప లేడా?'' అని ప్రశ్నించాడు స్వామి,

అయస్కాంతాన్ని అంటిపెట్టుకున్న యినుప రజనులా వున్న గడ్డపు వెంట్రుకలు చిత్రంగా వొంగుతుండగా అతడి పెదవులు సాగాయి. యిక సమాధానం రాకపోవచ్చునని యెదుటి వ్యక్తి బేంబేలు పడిపోయిన తర్వాత, మెల్లగా ''లేదు, కూర్చోండి!'' అన్నాడతను ముక్తసరిగా.

వొకటి రెండు నిముషాలు తటపటాయించి తర్వాత మంచంపైన కూర్చున్నాడు స్వామి. కాషాయ వస్త్రపుకొంగుతో నుదుటిపైన పొటమరించిన చెమట బిందువుల్ని తుడుచు కుంటూ, ''మన దే వూరు నాయనా?'' అని అడిగాడు.

వీలైతే నువ్వే తెలుసుకో చూద్దామని పోటీకి సిద్ధమైనట్టుగా మరి కాస్సేపు నిశ్శబ్దాన్ని నిగుడించి, ఊరించి, ''యీ వూరే లెండి, రెడ్డెప్ప మా తమ్ముడే!'' అన్నాడతను.

''అనుకుంటిని చూసినప్పుడే. రెడ్డెప్పకంటే కొంచెం పొడుగ్గా వుండావు. రంగుకూడా వొక చాయ యెక్కువే! నువ్వే నా కువాయిట్‌నుంచి వచ్చింది? నీపేరు'' తటపటాయిస్తూ ఆగాడు స్వామి.

''రాజగోపాల్. మీ రీ వూరొచ్చినారని మా తమ్ముడే చెప్పినాడు'' మంచానికో చివర సర్దుకుంటూ అన్నాడు రాజగోపాల్.

''చెయ్యి కేమైంది నాయనా?'' స్వామి అడిగాడు.

''చిన్న యాక్సిడెంటు'' రాజగోపాల్ సమాధానం చెప్పాడు.

''యెప్పుడు?''

''నెల దినాలకు పైగా అయింది లెండి! మొదుటి కట్టు కువాయిట్‌లోనే యేసుకున్నాను. రెండోదీ, మూడోదీ పుత్తూరులో. పోయిన సోమవారానికే యిప్పెసెయ్యాల్సింది. వొక దినం తీరికదొరికితే పోయి విప్పించుకోని వచ్చేయచ్చు. కుదరడమే లేదు. మా తమ్ముడొచ్చి రిలీవ్ చేసేవరకూ యీ కట్టుతో పోరకలాడాల్సిందే!'' స్వగతంగా గొణుక్కోసాగాడు అతను.

''రెడ్డెప్ప యెక్కడికి పోయినాడు?''

విహారయాత్ర కెళ్లాడన్నంత మామూలుగా ''హాస్పిటల్‌కు'' అన్నాడు రాజగోపాల్.

అదేమీ యెదురుచూడని వార్త కాదన్నంత తాపీగా ''యెప్పుడు?'' అని అడిగాడు స్వామి.

''పదైదు దినాలయింది నిన్నటికి. యిరవై దినాలప్పుడు వచ్చినప్పుడే చిలక్కి చెప్పినట్టుగా చెప్పినాను. పగులనకా, రేత్రనకా చెరుకు తోట కాడ పడి పొర్లాడద్దురా అని. లాభం లేకపోయింది. అయినా మనిషికి మాంతమైన ఆశ వుండకూడదు సామీ! మన తోకెంతో అంతే ఆడించాల. వొళ్లెరగని శివం తప్పు గదా! నాలుగు నెలలకు ముందు పోయిన మార్చి నెలలో వచ్చినప్పుడే ఆసుపత్రికి పోయి చెకప్ చెయ్యించుకోమని చెప్పినాను. యిక్కడేందో పొర్లిపోతా వుండాదని చెప్పినావు. తీరా బండి కదలదని మొరాయించినాక ఆస్పత్రికి పోయినావు. యిప్పుడేమయింది? డాక్టర్లు రోగానికి అదేందో మూరెడు పొడుగు యింగ్లీషు పేరు పెట్టినారు. వూపిరితిత్తులు బొత్తిగా పనికిరాకుండా పోయినాయని తేల్చిపారేసినారు. యెప్పుడు డిశ్చార్జీ చేస్తారో కూడా చెప్పకుండా బెడ్డుకు కట్టి పారేసినారు!'' చెప్పుకోడానికో వ్యక్తి దొరకడంతో తన అక్కసునంతా వెళ్లగక్కసాగాడు రాజగోపాల్ ''వాళ్లు కూడా మనిషి మాదిరే గదా సామీ! సేద్యగాణ్ణి పెట్టుకుంటే ఖర్చయితిందని తరిమేస్తివి. సేద్యమంటే యిద్దరు ముగ్గురు మనుషులకు యిరవై నాలుగ్గంటల పని. పంట చేతికి రాకముందే రూకలు లెక్కబెట్టుకోని దానితోనే కడుపు నింపుకుంటివి. తిండీ, నీళ్లూ పట్టించుకోకపోతివి. యిప్పుడు ఆస్పత్రిలో హాయిగా రెస్టు తీసుకుంటా వుండావు.. నన్ను యిక్కడినుంచీ కదలనీకుండా చేస్తే నాకు జరిగేదెట్లా? అది చెప్పు?''

తననే రెడ్డెప్పయినట్టుగా వూహించుకుని, తననే సూటిగా ప్రశ్నించడంతో స్వామి కంగారు పడిపోయాడు.

''మొన్నటికి మొన్న రోడ్డుపైకి లారీవొచ్చి నిల్చుకుంది...'' చీకాకుతో ముడతలు పడ్డ ముఖాన్ని అవతలకి తిప్పుకుంటూ రాజగోపాల్ చెప్పసాగాడు.''చెరుకు కొట్టేదానికి మనుషులు దొరక్క ఆరు గంటలు లేటయింది. లారీ బాడిగ పెరిగిపోయింది. ఫ్యాక్టరీ

కాడికి పోయి చూస్తే యాభై, అరవై లారీలు వెయిటింగులో వుండినాయి. నీ వంతొచ్చే కాడికి పది గంటలు లేటు. వాళ్లదేం పోయింది? గంట గంటకూ నూర్లు నూర్లుగా వెయిటింగు చార్జీ వసూలు జేసినారు. నువ్వు పెట్టిన పెట్టుబడెంత? వచ్చిన ఆదాయమెంత? నాలుగువేలో, అయిదువేలో యెక్కువొచ్చిందే అనుకో! యిప్పుడు ఆస్పత్రి ఖర్చు అంతకు రెండు మూడు రెట్లు అయిపోయింది గదా! అందుకే యీ మడీ గిడీ వద్దు! బుద్ధిగా మామిడి చెట్లు పెట్టెయ్యి. అయిదారేండ్లలో కాపుకొచ్చేస్తాయి. నువ్వు యింట్లో కాలుమీద కాలేసుకుని కూర్చున్నా వొరువమానం తగ్గదు అని చెప్పినాను. వింటివా? యిప్పుడు అనుభవించు!''

బలవంతంగా యెవరో ముందుకు నెట్టినట్టుగా సూర్యుడు కొండలపైకి తొంగి చూస్తున్నాడు. ఆకాశంలో పక్షుల గుంపొకటి యెక్కడికో వలసపోతోంది.

మామిడి తోట కవతల ముళ్లకంచెల దగ్గర యెండుటాకులు నలుగుతున్న శబ్దం వినిపించింది. రాజగోపాల్ ముందుకు వొంగి చూసి, ''యీ షుక్కూర్‌గాడు వొంటిగానే అగోరిస్తావుండాడు. యీ పొద్దుకూడా ట్రాక్టరొచ్చేటట్టు లేదు!''అంటూ విసుక్కున్నాడు. ''యిందుకే యీ తగరారు పనొద్దంటే వాడు వినడు. కానరాని దేశంనుంచి వచ్చి నెలయింది. యింటికాడ పెండ్లాం బిడ్డలతో వునిందేమో వారం కూడా లేదు. పది దినాలుగా ఆస్పత్రి కాడనే అల్లాడినాను. నాలుగునాళ్లుగా వొకటే పట్టు పట్టేసినాడు. అదును పోతా వుందంట. మడి దున్నేసి టమోటా నారు పొయ్యాలంట! ఆ పని దగ్గరుండి నేనే చెయ్యించాలంట! అప్పటికి నా కింకేమీ పనే లేనట్టు, నాకో బతుకే లేనట్టు...!''

దగ్గరికి వచ్చిన తరువాత నడక వేగాన్ని పెంచుతూ, ''ట్రాక్టరు రాలేదన్నా!'' అని వాకబు చేశాడు షుకూర్.

సన్నగా, పొడవాటి మెడతో చొక్కా తొడుక్కున్న జిరాఫీలా విచిత్రంగా కనిపిస్తున్నాడతను. యిప్పుడిప్పుడే మొలుస్తున్న మీసమూ, గడ్డమూ వర్షాలు కురవక అదును తప్పిన పొలంలోని పంటలా పలచబారి వున్నాయి.

''వాళ్ల యింటికాడికి పోతే ట్రాక్టరెత్తుకొని తెల్లారిజామున్నే కృష్ణారెడ్డి యెలబారి పోయినాడని చెప్పినారు. యీడికే వచ్చుంటాడని అనుకుంటినే!'' అంటూ సాగదీశాడు షుకూర్.

''గల్పో గల్పో అంటావు. యింత వొళ్లయ్యి గాకుండా పనులు చేసే వాణ్ని తొడుక్కోని పోతే వాళ్లు నా ముఖాన్నే కారి వూంచేస్తారు!'' రాజగోపాల్ ముఖం మొటమొట లాడసాగింది.

''తప్పు నాది గాదన్నా! నీకంత కోపమైతే ఎట్లా?'' షుకూర్ గింజుకోసాగాడు. ''నిన్న కృష్ణారెడ్డి వాళ్లింటికాడికి పోయి కాపేసుకొని కుచ్చుంటిని. అంతా దున్నకాల రోజులు. యీ వూళ్లో వుండేది రెండో మూడో ట్రాక్టర్లు. గిరాకీ ఎక్కువ. నిన్నంతా ఆ తూరుప్పక్క దున్నే దానికి పోయి రాత్రి యెనిమిది గంటలకు యింటికొచ్చినాడు. లక్ష రకాలుగా చెప్పే

సొచ్చినాను. కావాల్లంటే అయిదో, పదో యెక్కువగా యిస్తానని కూడా మాటిచ్చినాను. వస్తానని నమ్మకంగా చెప్పినాడు. యిప్పుడో, యింకొంచేపుటికో వచ్చినా రావచ్చు!''

''నాలుగు దినాలకు ముందు ఆస్పత్రి కాడికొచ్చినప్పుడే చెప్పినాను గదా నీకు. నేను వూరికొచ్చేసరికి దున్ని పెట్టేయమన్నాను గదా! నాలుగు దినాలుగా యేం చేసినావు? కాదంటే వొకటి సగంగా చెరుకు తుండ్లు కాలిపించినావు. పట్టుదల లేనోడు బొంబాయి యెయిర్‌పోర్టుకు కూడా పోలేడు తెలుసునా? యేజెంటుకాడికి యెన్ని దినాలు తిరగాల? యీపొద్దూ, రేపూ అని వాడు అరిచేతిలో స్వర్గం చూపించి నూర్లు నూర్లుగా దుడ్డు మాయం చేసేస్తాడు. యిదొకటీ, అదొకటీ అని పోయినప్పుడంతా కాగితాల మీద చేవ్రాలు చేయించుకోని ఫీజు దుడ్డు వసూలు చేస్తానే వుంటాడు. యెందుకిదీ అని అడిగానవంటే నీ పని యింకయినట్టే! నీ అట్లాంటోడు యేజెంటు చెయ్యి తడిపే దానికే పొలువూలి యిక్కడ్నే కాళ్లు జాపేస్తాడు!'' సాలెపురుగు కదులుతున్నట్టుగా చేతులు తిప్పి హావభావాలు ప్రకటిస్తూ రాజగోపాల్ వాదించసాగాడు.

''నీకు బాగా తెలిసిన యేజెంటుండాడని అంటివి గదన్నా!'' షుకూర్ కళ్లు పెద్దవి చేసుకుని అడిగాడు.

''యెంత తెలిసినోడైతే మాత్రం వూరికే పని చేస్తే వాని కడుపాత్ర మెట్ల తీరితింది? తొలీ తడవ బొంబాయికి పోయినప్పుడు వాళ్ల లాడ్జింగులో నెల దినాలకు పైగా వుండాల్సొచ్చింది. అసలు వీసా వస్తిందో, రాదో తెలియని పరిస్థితి. అప్పటికే అయిదువేలు సెలవయి పోయింది. టికెట్లకని యెత్తుకొని పోయిన ముప్పయి వేలల్లో రెండు వేలు లాడ్జికే ఖర్చయిపోయింది. యేజెంటొకసారి వారాలు వారాలుగా కంటికి కనబడకుండా పోయినాడు. యింక సవకం భుజానేసుకుని యింటికి పోవాల్సిందేనని అనేసినారు కొందురు. అయినా పట్టిన పట్టొదిలినానా చెప్పు? చస్తే యిక్కడ్నే చావనైనా చస్తానుగానీ యెనక్కు పొయ్యేది లేదనేసినాను. నీ మాదిరి రెండు గంటలు వాళ్లింటికాడ కాపేసి ట్రాక్టరోణ్ణి తొడుక్కోని రాలేనోన్నయితే కువాయిట్‌కు పోయుందునా అని? నిన్ను నమ్ముకోని ట్రాక్టరొస్తింది గదా అని తెల్లారుజామున్నే లేచి యీడికొచ్చి కాపెట్టుకోని కూర్చున్నాను. నిన్నని యేం లాభం? తప్పు నాది!'' మాట్లాడుతూనే పైకి లేచి పాంటు జేబులోకి చేయి పెట్టి పాన్‌పరాగ్ పాకెట్టు పైకి తీసుకున్నాడు రాజగోపాల్.

తనను పట్టించుకోకుండా వాళ్లిద్దరూ మాటల్లో పడిపోవడంతో స్వామి ప్రేక్షక మాత్రుడై పోయాడు. అరమోడ్పు కన్నులు పెట్టి పెదవులు కదిలిస్తూ జపం చేసుకుంటున్నట్టుగా ముఖం పెట్టుకుని వాళ్ల మాటలు వినసాగాడు.

షుకూర్ మామిడి చెట్టు కొమ్మ పైకెక్కి కూచుంటూ ''ఆ సుబ్బరామ చౌదరి కెమెరా కొంటాననంటా వుండాడు. రేటెంతో తెలుసుకోమన్నాడన్నా!'' అన్నాడు.

చిటికెడు పాన్‌పరాగ్ నోట్లో వేసుకుని నములుతూ, ''యెవురూ? దిగీధి పెద్దింటోళ్ల చిన్నబ్బోడేనా?'' అని అడిగాడు రాజగోపాల్.

షుకూర్ తల వూపాడు.

''వాడి ముఖం. వాడు కొనేదీ లేదు, పాడూ లేదు!'' యెర్రటి ద్రవాన్ని దూరంగా వుమ్ముతూ అన్నాడు రాజగోపాల్ - ''వచ్చినప్పుడంతా టేపు తీసకరా. వీసీఆర్ తే అంటాడు గానీ వాడు కొనిందెప్పుడూ లేదు. భలే బేరం పట్టుకొచ్చినావులే!'' అంట్లూ నోరు చప్పరించేశాడు.

''అట్ల మాట్లాడితే నే నొప్పుకోను. నాలుగు నూర్లు జేసే ట్రాన్సిస్టర్ని ఆరు నూర్లకు సెటిల్ చేసింది నేనే గదా! రే బోన్ కంటెద్దాల్ని వెయిన్నీ మున్నూర్రుకు బేరం కుదిరించిందెవురు? యీ మధ్యలో వానలు సరిగ్గా పడక, యీ ఫలితం సరిగ్గా రాక అందురూ గుడ్లు తేలేసుకోనుండారు. లేకపోయుంటే యీ పాటికి నువ్వు తెచ్చింటే సరుకంతా అమ్మించి పారేసుందును. నా అంత సరిగ్గా చింత గింజల యాపారం చేసేవోడు యీ వూర్లోనే లేడని యెవుర్నడిగినా చెప్తారు. అడుగుపెట్టే ముందు యెనకా ముందు చూసుకోని దిగాల! దిగినామో యింక అప్పీలుండగూడదు. అదీ నా లెక్క!'' షుకూర్ నూనూగు మీసాల పైన చేయి వేసి కళ్లు గుండ్రంగా తిప్పసాగాడు.

''నీ మాదిరి పెద్ద పులావరని ఫోజులు పెట్టి నోళ్లని యింతమందిని చూసినాను!'' చేత్తో గుప్పెడు జుట్టు పట్టి చూపుతూ అన్నాడు రాజగోపాల్: ''కువాయిట్‌లో పనికి తట్టుకోలేక రెండో దినాన్నే చేతులెత్తేసినోళ్లు యెందురో తెలుసునా? అక్కడెవురూ నీకు డన్‌లప్ బెడ్డులేసి సదుపాయాలు చెయ్యరు. వుండేదానికో చిన్న షెడ్డు. దాంట్లో నీతోబాటూ నీ మాదిరోళ్లే కొందురు. నీ వంట నువ్వే వండుకోవాల. నీ గుడ్డలు నువ్వే వుతుక్కోవాల. పని టయానికి సాజరైపోవాల. లేటయితే జీతం కట్! పనంటే పనే! వూపిరి తిప్పుకునే తీరికుండదు. డ్రయివింగంటే యిక్కడ మాదిరిగాదు. అదయిపోతూనే మిగలిన పనులు కూడా చెయ్యాలి. కిలాడీ పనులు చేసినా వంటే జైల్లోకి తోసేస్తారు. నమ్మకంగా వొళ్లు దగ్గర పెట్టుకోని పని చెయ్యాల. దుడ్డు యెంత అవసరమో అంతే ఖర్చుపెట్టుకోవాల. అప్పుడే యింటికేమైనా పంపచ్చు. లేకపోతే యేమీ మిగలదు. వచ్చినప్పుడంతా ట్రాన్సిస్టర్లూ, టేపులూ తెస్తావుండానని వొద్దంటే దుడ్డాస్తి వుందని అనుకుంటా వుండావేమో! యెంత కష్టపడతానో, అంతే సంపాదన. ముందే తెలుసుకో! మల్లంక చెప్పలేదంటే వొప్పుకునేది లేదు!''

''నా సంగతి నీకు తెలియుదన్నా! నన్ను తొడుక్కోని పోయి పనిలో చేర్పించిన పెద్దమనిషికి నా గురించి వొక్క మాటొస్తే నే నొప్పుకోను!'' అన్నాడు షుకూర్.

రాజగోపాల్ స్వామివైపు చూశాడు. ఆ క్షణం కోసమే యెదురుచూస్తున్నట్టుగా అతను కళ్లు పూర్తిగా తెరిచి చిరునవ్వు నవ్వాడు.

''నిన్న కత్తి తెచ్చినప్పుడు యీ సపారులోనే పెట్టినావుగదా! ఆ మణేగారి తోట్లోకి పోయి, నా పేరు చెప్పి రెండు యెర్ర నీళ్ల టెంకాయలు తోసకరా! సామికి టెంకాయ నీళ్లయినా యిద్దాం!'' మంచం కోడుపైకి వాలి పడుకున్నట్టుగా సోలిపోతూ హుకుం

జారీచేశాడు రాజగోపాల్.

షుకూర్ అయిదు నిమిషాల సేపు అటూ యిటూ పచార్లు చేసి, సపారులోకి దూరి కత్తి చేత బట్టుకుని బయటికొచ్చి, మట్టి బాటవైపు నడవసాగాడు.

''యీ పిల్లగాణ్ణి కూడా నీతో బాటు ఆ దేశానికి తొడుక్కోని పోతా వున్నావా, నాయనా!'' తన పాలకువ తెలపడం కోసం స్వామి పలకరించాడు.

''వచ్చినప్పటి నుంచీ యెట్లయినా గల్ఫ్‌కు తొడుక్కోని పొమ్మని ప్రాణాలు తీస్తా వుండాడు!'' అతడివైపు తిరగకుండానే చెప్పసాగాడు రాజగోపాల్ - ''కోరికలకేమీ తక్కువలేదు గానీ ప్రయోజకత్వ కొంచెమయినా లేదు. నేను యెందురి కాళ్లు పట్టుకోనీ, యెంత దుడ్డు ఖర్చు పెట్టితే కువాయిట్‌కు పోయినానో వీనికేం తెలిస్తింది? మంచి మంచోళ్లకే అక్కడ చెలావణీ లేదు. వీడొచ్చి తవ్వి తలకెత్తే దేముంది? నేనీసారి కువాయిట్‌కు పోవడం లేదు; షార్జాకు ట్రయి చేస్తా వుండాను. అంటే గూడా వదలడం లేదు. అక్కడికైనా పర్వాలేదు, వచ్చేస్తానని తగులుకోనుండాడు!''

కాస్సేపు ఆలోచించి ''కువాయిట్ కంటే షార్జాలో ఆదాయం యెక్కువా నాయనా?'' అడిగాడు స్వామి.

''వొకటో రెండో అటూ యిటూగా అంతా వొకటే! లేదంటే కువాయిట్‌కూ, నాకూ ఋణం తీరిపోయింది. నిజానికి నా పెండ్లాం చేసుకున్న పుణ్యం బాగునింది. లేకపొయ్యుంటే యీపాటికి కువాయిట్ జైల్లో కమ్మీలు లెక్కబెట్టుకుంటా కుచోనుందును!'' రెండు నిముషాలు కాలయాపన చేసిన తరువాత మళ్లీ రాజగోపాలే కొనసాగించాడు.

''మా మేనేజరును ఫ్యాక్టిరీ కాడికి తీసుకోని పొయ్యేటప్పుడు ఆక్సిడెంటయింది. నేను రైట్ సైడే పోయినాను. లారీవాడు రాంగ్‌లో వచ్చి గుద్దేసినాడు. రియర్ మిర్రర్‌లోంచీ చూసుకోలేదని వుద్యోగ మియ్యనసేసినారు. ఆస్పత్రిలో రెండు దినాలు పెట్టుకోని, పోలీస్టేషనుకు పిలిపించి, యిన్నూరు దీనార్లు ఫైన్ వసూలు చేసుకున్నారు. దక్కినమ్మకు బొక్కింది చాలనుకోని గుడ్డా గుసురూ సర్దుకోని ఫ్లైటెక్కేసినాను''

మట్టిబాటపైన కందెన మరచిన యెద్దుబండి చక్రం శబ్దం చేసుకుంటూ వెళ్తోంది. యెక్కడినుంచో బోరింగు యంత్రం సవ్వడి స్పష్టంగా వినవస్తోంది. సూర్యుడు కిరణాల్ని కొండలపైన పదును పెట్టుకుంటున్నాడు.

పెద్దగా నిట్టూర్చి, ''వొకర్నని లాభం లేదు. నా జాతకం బాగలేదు!'' అన్నాడు రాజగోపాల్. ''సరిగ్గా వాడు ఆస్పత్రిలో చేరే సమయంలో రావాలని రాసి పెట్టుంటే తప్పించుకునే దానికవుతుందా? యిప్పటికే రెండు వేలు చిలుం వదిలిపోయింది. చాలని దానికి యీ మడి దున్నకం పనీ, నారు నాటించే పనీ న్నాపైన్నే పడింది. సొంతంగా నాద్గ్గరైతే వసూలు చేస్తా వుండారుగానీ, వీళ్లు అవసరమైనప్పుడు పైసా యిచ్చుండారా? యెమ్మే అయినాక యింట్లో ఖాళీగా నాలుగేళ్లుంటే నరకమే చూపించినారు గదా! నా కంటే

ముందుగా వుద్యోగ మొచ్చినప్పుడు మా తమ్ముడెంత నీలిగినాడు? వాణ్ణే చూసిన కంటితో తల్లీ దండ్రీ అయినా నన్ను చూసినారా?. యేందో రెండు దమ్మిడీల సంపాయిస్తా వుండాను గాబట్టే యిప్పుడందురూ అయినోళ్లయి పోయినారు!''

అతడి ధోరణి మార్చడం కోసం ''మీ నాయనింకా హాస్పేటనుంచి రాలేదా?'' అని ప్రశ్నించాడు.

''రాలేదు. ఆయన కక్కడ కొల్లబోతా వుందంట! యిక్కడ నేనుండాను కాబట్టి దిగుల్లేకుండా వుందంట! యిప్పుడిప్పుడే రాడంట. ముందునుంచీ ఆయనదెప్పుడూ వలపక్షమే! వుద్యోగాలు రాని చదువులోకి నన్ను తోసేసి, మా తమ్ముణ్ని మాత్రం మంచి దాంట్లోకి చేర్పించినాడు. నాల్గైదేండ్లు వృధాగా పోయింది. మా బావ కాళ్లు పట్టుకోని డ్రైవింగు నేర్చుకోని, లైసెన్సు తెప్పించుకున్నాక యీ బతుకు తెరువైనా దొరికింది. పెద్దగా చదువుకున్న డ్రైవరయితే కువాయిట్ మత్తేబులు తటపటాయిస్తారు. యెమ్మే చదివినట్టు యెవురితోనూ అనద్దు' అని ఆ యేజెంటు లక్షసార్లు చెప్పినాడు.

రెండు కొబ్బరి కాయల్ని తొడిమల్తో బాటూ పట్టుకొని మోసుకొచ్చాడు షుకూర్.

''యింకొంచెం పెద్ద కాయల్ని తెచ్చుంటే నీ సొత్తేం పోతింది?'' రుసరుసలాడాడు రాజగోపాల్.

''యింతకంటే పెద్ద టెంకాయలు యీ పక్క తోటలే యేడ్డైనా చూపిస్తే నూర్రూపాయలు వూరికేనే యిచ్చేస్తాను!'' షుకూర్ కత్తితో కొబ్బరి కాయని కొట్టి రంధ్రం చేస్తూ చెప్పసాగాడు - ''ఆ మణోరు వాళ్ళ బాయికాడనే వుండాడు. నువ్వొకసారి తోటకాడికి రమ్మన్నావని చెప్పినాను. వస్తానన్నాడు.''

''పగలయినోడు ఆ మాటనడు. కూడా తొడుక్కోని వచ్చుంటాడు!'' కొబ్బరి కాయను తీసి స్వామి కందిస్తూ కసురుకున్నాడు రాజగోపాల్.

''మణోరంటే మనింట్లో సేద్యగాడు కాదన్నా! రమ్మంటే కూలిమనిషి మాదిరిగా చక్కా వచ్చేస్తాడా? ఆ కాడికీ గల్ఫ్ సిగరెట్టు పెట్టెలు నీ కోసరమే తెచ్చినాడని ఆశ పెట్టినాను. నీ యెనకనే వస్తాను పదమన్నాడు!'' రెండో కొబ్బరి కాయని రాజగోపాల్ కందిస్తూ షుకూర్ సమాధానం చెప్పాడు.

''యీ పనులంతా పేరబెట్టుకుంటే నీకే నష్టం!'' కొబ్బరి నీళ్లు తాగుతూ చెప్పసాగాడు రాజగోపాల్ - ''ఆ యేజెంటు పోయిన సోమవారమే రమ్మన్నాడు. నేనీ వూళ్లో యీ పనులన్నీ చక్కబెట్టినాక గానీ కదల్లేదు. ఆ పైన నీ యిష్టం!''

''చూస్తా వుండన్నా! ట్రాక్టరు వచ్చిందంటే రెండెకరాల భూమి దున్నేదెంతసేపు? సుబ్బరావు చౌదరికి కెమెరా, పత్తార్ సాబుకు టేపూ, కృష్ణారెడ్డికి ట్రాన్సిస్టరూ బేరం చెప్పేసినాను. యింకీ మణోగారి పనొకటి మిగిలుండాది. యీ పొద్దో, రేపో అదీ అయిపోతుంది!'' నీళ్లు తాగగా మిగిలిన కాయల్ని రెండుగా చీల్చి కొబ్బరి తీస్తూ అన్నాడు షుకూర్.

''ముందు మణోగారి దగ్గరికి పో! సిగరెట్టు పెట్టె నా జేబులోనే వుందని చెప్పి యిక్కడికి పంపించు! కృష్ణారెడ్డిని యెతికి పట్టుకుని మడి దున్నించు. సాయంత్రం కెమెరా, టేపూ బేరాలు చూద్దాం!'' రాజగోపాల్ వరసగా పనులు పురమాయించాడు.

కత్తిని సపారులో చెక్కిన తర్వాత షుకూర్ కాళ్లీడ్చుకుంటూ తోట బయటికి నడిచాడు.

లేత కొబ్బరి నములుతూ, ''అయితే మళ్లా దేశం వదిలిపెడతా వుండావా నాయనా!'' అని అడిగాడు స్వామి.

''అవును, సామీ! యీ దేశం మనకు లాయికీ గాదు. పనితనమూ, ఎక్స్‌పీరియన్సూ యిక్కడ పనికిరావు. చేసే పనికీ, వచ్చే ఆదాయానికీ సంబంధం వుండదిక్కడ. అక్కడైతే చేసినంత పనీ, సంపాదించినంత జీతమూ... ఫాల్టు నాదిగాదని యెంత చెప్పినా వాళ్లు విన్లేదు. యింక కువాయిట్‌కు పొయ్యే దోవలేదు. ఆ యేజెంటు షార్జాకు పంపిస్తానన్నాడు. యిక్కడ దుడ్డు లేనోడు పూచిక పుల్లకు పనికిరాడు. పోయిన సమత్సరమే పాకాలలో మిద్దె గట్టించినాను. రెండేండ్లకు ముందు కొత్తకోట కాడ రెండెకరాల మామిడితోట కొనిపెట్టినాను. వొయి సుండేటప్పుడే పది పన్నెండేండ్లు సంపాయించుకోని వచ్చేయాల. వుండేది వుప్పురాళ్ల మాదిరి యిద్దరు కొడుకులు. తలా వొకిల్లు, తలా పదెకరాల మామిడి తోట... కాలు మీద కాలేసుకుని కూర్చున్నా జరిగిపోవాల...

నా మాదిరిగా దేశం గాని దేశానికి పోయి సంపాయించుకోని రావాల్సిన గతి వాళ్లకు పట్టగూడదు. పెండ్లాం, బిడ్డలను వొదులుకోని వొంటిబిత్తిరి బతుకు వాళ్లు బతకగూడదు!'' సూటిగా తూర్పు కొండలకేసి చూస్తున్న రాజగోపాల్ కళ్లలోంచీ సూర్యకిరణాలు చుక్కల్లా మెరుస్తూ పరావర్తనం చెందుతున్నాయి. అంతవరకూ చిడిముడిపాట్లు పడుతున్న అతడి ముఖంలో మొదటిసారిగా చిరునవ్వు తొంగిచూస్తోంది. చేతికొక కట్టుందన్న విషయాన్ని సైతం మరచిపోయి కుడిచేతి తోనే కొత్త పాన్ పరాగ్ పాకెట్టు చించుతున్నాడతను.

''మా తమ్ముడికి యీ చేను మిందా, తోపు మిందా మనసిరిగిపోయింది'' మళ్లీ నింపాదిగా మొదలెట్టాడు రాజగోపాల్ - ''వాళ్లత్తగారి వూరుమింద మనసు మళ్లింది. అమ్మేయాలని పట్టుబట్టుకోనుండాడు. మా రామచంద్రుడికి భూమీ బుర్రా యిష్టం లేదు. యెవురికో ఎందుకు అమ్మాల? మతింపేసి మనమే కొంటే పోయిందని అనుకుంటా వుండాను. మనలో మనకయితే స్టాంపు డ్యూటీ కూడా తగ్గితింది. అయినా యీ వూర్లో యిప్పుడు బేరానికి దిగే దానికి రూకలెవురి కుండాయి? మణోర్ని మతింపు చెప్పే దానికి రమ్మన్నాను''

''యెండెక్కిపోతా వుంది. బయల్దేరతాను, నాయనా!'' పైకి లేచి నిల్చుంటూ అన్నాడు స్వామి.

''పద్దైదు దినాలకు ముందు నేనొకసారి ఆశ్రమం దగ్గరికొచ్చినాను, సామీ! మీరు లేరని చెప్పినారు'' మర్యాద కోసం తానూ కొంత దూరం నడుస్తూ చెప్పాడు రాజగోపాల్.

''పద్దెనిమిది దినాలుగా యెర్రేవల్లి శుకబ్రహ్మాశ్రమంలో గీతోపన్యాసాలు. యిక్కడికొచ్చింది నిన్ననే!'' అన్నాడు స్వామి.

''మీరొచ్చినట్టు మా నాయనకు కూడా జాబు రాసినాను. అక్కడ పనెక్కువగా వుండేటట్టుంది. సీజనయిపోతానే వచ్చేస్తాడు!'' కంచె దగ్గర ఆగిపోతూ వర్తమానాన్ని వెల్లడించాడు రాజగోపాల్.

తల వూపుతూ నడవసాగాడు స్వామి.

మట్టి బాటపైన కాస్సేపు నడిచిన తర్వాత వెనుదిరిగి చూశాడు.

రాజగోపాల్ యింకా అక్కడే నిల్చుని తనకేసి చూస్తున్నాడు.

నీళ్లలో వలవేసి కాచుక్కూచున్న అటవికుల్లా మట్టి గుట్టలూ, వలల్లా మామిడి తోటా, మడీ, వలలో చిక్కిన కొరమీనులా రాజగోపాల్ కనిపిస్తున్నాడు.

## 3

యెండనంతటినీ భూగోళంపైకి కేంద్రీకరించడం కోసం ఆకాశం నిలబెట్టిన కుంభాకర కటకంలా సూర్యుడు మెరుస్తున్నాడు.

అద్దాలు కుట్టిన ఆకుపచ్చని చీర చుట్టుకున్న సుగాలీ పాపాయి లిద్దరు కౌగిలించుకుని కూర్చున్నట్టుగా యెండను పరావర్తనం చేస్తున్న బండరాళ్ల గుట్టా, దాని చుట్టూ మామిడి తోటా కనిపిస్తున్నాయి.

అటూ యిటూ కలియజూస్తూ తోటలోకి అడుగుపెట్టాడు స్వామి.

గాలి వీచకపోవడంతో ఆ కల్లాడని మామిడి చెట్లు బొమ్మల్లా నిల్చున్నాయి.

తోటలోకి నాలుగడుగులు సారించగానే రెండు పెద్ద మామిడి చెట్ల నీడలో యెర్రటి లారీ ఒకటి కనిపించింది. దానిపైన బిగించిన టార్పాలిన్ పట్టా లోంచి మామిడి కాయలు కొన్ని తొంగి చూస్తున్నాయి.

సపారు కవతల మామిడి చెట్టు మొదలు దగ్గర యేడెనిమిదేళ్ల వయస్సున్న అబ్బాయొకడూ; నాలుగైదేళ్ల వయస్సున్న అబ్బాయొకడూ రెండు కుక్క పిల్లలతో ఆడుకుంటున్నారు. తోటంతా ప్రతిధ్వనిస్తుండగా కుక్కపిల్లలు రెండూ ప్రాణభయంతో గగ్గోలు పెడుతున్నాయి. పిల్లల కేరింతలూ, కుక్కపిల్ల అరుపులూ జోలపాట లేమోనన్నంత హాయిగా సపారు ముందు కుక్కిమంచంపైన కూర్చునే నిద్రలో జోగుతున్నాడో వ్యక్తి. చేతులు మొలిచిన గుర్రానికి షర్టూ, పాంటూ తొడిగినట్టున్న ఆకారం అతడిది. పలచబారుతున్న వెంట్రుకల్లో అక్కడక్కడా తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి.

స్వామి మంచం దగ్గరికొచ్చి నిల్చున్నాడు.

కొత్త వ్యక్తి పొలకువను గమనించినట్టుగా పిల్లలిద్దరూ కుక్కపిల్లల తోకలు పట్టి ఆడిస్తున్నారు.

కాషాయవస్త్రంతో చెమట తుడుచుకుంటూ మంచానికో చివర్లో కూర్చున్నాడు స్వామి. మంచం కూసాలు కిర్రుకిర్రు మన్నాయి. తూగుతున్న వ్యక్తి వులిక్కిపడి కళ్లు తెరిచాడు. కలో, నిజమో తేల్చుకోలేకపోతున్నట్టుగా కాషాయంబరధారిని చూసి తడబడిపోయాడు. గడ్డమూ, మీసమూ విడివడేలా వో చిరునవ్వు మధ్యలో పుట్టించి, ''రామచంద్రయ్యే గదానువ్వు!'' అని పలకరించాడు.

అతను పైకి లేచి, రెండు చేతులూ జోడించి, ''నమస్కారం.. నమస్తే...! మీరు... మీరే కదా!'' అంటూ కూడీ కూడీ చదువుతున్నట్టుగా పొడి పొడి అక్షరాల్ని వుచ్చరించాడు.

ప్రశ్న అర్థమైనట్టుగా తల వూపుతూ, ''కూచో నాయనా!'' అని మంచం చూపెట్టాడు స్వామి. అతను కూర్చున్న తర్వాత, ''యీ దినం మణోరి యింట్లో బిక్ష'' అని బొజ్జ తడుముకుని, ''సాయంత్రం ఆశ్రమంలో గీతాప్రవచనవుంది. అందుకని వెంటనే బయల్దేరేసినాను. యెండ జాస్తీగా వుందికదా! కొంచేపు తోటలో విశ్రాంతి తీసుకుందామని యింట్లొచ్చినాను. పిల్లకాయలిద్దరూ ఆడుకుంటా కనిపించినారు'' అంటూ ముక్తాయించాడు.

రామచంద్రయ్య పిల్లలిద్దర్నీ, ''టింకూ! సోనీ!'' అని పిలిచి ''స్వామికి విష్ చేయండి!'' అన్నాడు.

గోల పెడుతున్న కుక్కపిల్లలున్న చేతులతోనే వాళ్లోసారి ''గుడ్ ఆఫ్టర్ నూన్!'' అంటూ సాగదీసి, అంతటితో తమ పనయిపోయినట్టుగా లారీ దగ్గరికి పరుగెత్తారు.

''యింట్లో యెవ్వురైనా వుండారేమో చూసి రమ్మని తోటోడ్ని పంపిస్తిని. వాడే చెప్పినాడు నువ్వొచ్చి రెండు దినాలయిందనీ, యిప్పుడు తోటకాడ వుండావనీ! మీ అన్నలిద్దర్నీ చూసినాను. యిప్పుడు నిన్నూ చూసేసినాను. సంతృప్తిగా వుంది. నీ భార్యను కూడా తోడ్కొని రాగూడదా నాయనా?'' ఎండకు తాళలేక ఆపసోపాలు పడుతూ ప్రశ్నించాడు స్వామి.

''లేదండీ!'' పెద్దగా శబ్దం వచ్చేలా ఆవులించాడతను. ''ఆమెకి స్కూలుంది. ప్రయివేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తా వుంది లెండి! యెస్టాబ్లిష్డ్ స్కూలే! కంపారిటివ్‌గా వాక మాదిరిగా పే చేస్తారు. యీ సమ్మర్ హాలిడేస్‌లో కూడా వాళ్లు ఫౌండేషన్ కోర్సులు జరపతా వున్నారు. యిప్పుడొచ్చే ఫీజుల్లో సగం టీచర్లకే యిస్తారు. అందుకని ఆమె అక్కడే వుండిపోయింది''

పిల్లల చేతుల్లోంచి యెగిరి గంతేసి కుక్కపిల్ల గొంతుచించుకుంటూ పరుగెత్తసాగింది. వాళ్లిద్దరూ దాని వెంటపడ్డారు.

''పిల్లకాయలు వాళ్లమ్మని కలవరించరా?'' అని అడిగాడు స్వామి.

''కలవరించినా దగ్గరుండే సమయం వాళ్లమ్మకుంటే గదండీ!'' మరోసారి ఆవులిస్తూ చెప్పాడు రామచంద్రయ్య - ''తెల్లారి ఆరునుంచీ తొమ్మిది దాకా స్పెషల్ క్లాసులు. తొమ్మిదినుంచీ అయిదు దాకా స్కూలు. అయిదునుంచీ యెనిమిది దాకా స్పెషల్ క్లాసులు.

స్పెషల్ క్లాసుల ఫీజు టీచర్లకే యిస్తారు. అందుకని పని తప్పదు. ఆమె యింటికొచ్చేసరికి పిల్లలు తూగుతూ వుంటారు. పిల్లల చార్జీ నాపైన పడి చానా యేండ్లయి పోయింది. అందుకే నాతో బాటూ తొడుక్కొచ్చాను. వూరినిండా బంధువులనే పేరే గానీ పిల్లకాయల్ని చేరదీసే వాళ్లెవరూ లేనే లేరు. పనోళ్లు చేసిన సంగటే వాళ్లూ తిన్నారు. యింట్లో వాళ్లందురూ హాస్పిటల్ దగ్గరే వున్నారు. యీ వూరికొచ్చినప్పటినుంచీ ప్రేమగా పలకరించే వాళ్లే కనబడలేదు. మిమ్మల్ని చూస్తే ప్రాణం లేచొచ్చింది!''

కుక్కపిల్ల లారీ కిందికెళ్లిపోయింది. పిల్ల లిద్దరూ లారీకింద పాకసాగారు.

''పిల్లలు దెబ్బలు తగిలించుకుంటారేమో, చూడు నాయనా!'' స్వామి హెచ్చరించాడు.

''ఆ భయం లేదులెండి! అవసరమైతే లారీ బోల్టులు లాగిపారేస్తారేమో గానీ, వాళ్లు దెబ్బలు తగిలించుకోరు. ఆ మాదిరిగా తయారుచేసినాను వాళ్లను'' జేబులో చేయి పెట్టి సిగరెట్టు పెట్టె వెలుపలికి తీయబోయి అంతలోనే ఆ ప్రయత్నాన్ని అతికష్టంపైన విరమించుకొని, శరీరమంతా కదిలిపోయేలా ఒళ్లు విరుచుకున్నాడు రామచంద్రయ్య.

''బుద్ధి కొద్దీ జీవనమంటాది శాస్త్రం. మీ ముగ్గురిలోనూ నిన్ను చూస్తే కడుపు నిండతా వుంది నాయనా! చదువుకునిందానికి వుద్యోగం చేసుకుంటా వుండావు. టౌన్లో సంసారం చేసుకుంటూ వుండావు...'' స్వామి భుక్తాయాసంతో రొప్పుతూనే వున్నాడు.

''టౌన్లో బతికేదంటే సులభమైన పనిగాదు, స్వామీ! ఖర్చెక్కువ. ఫైనాన్సు కార్పొరేషనొకటి మొదలుపెట్టి రెండేళ్లవతా వుంది. రోజా తెల్లారొక గంట, సాయంత్ర మొక గంట ఆ పని. రియల్ ఎస్టేట్ బిజినెస్ మొదలుపెట్టినాం యీ సంవత్సరమే! అయిదుమంది పార్టనర్లు. కొంచెం యేమారితే మునిగిపోతాం. అక్కడొక రెండు మూడు గంటల పని. యీ పనులతోనే సతమతమౌతా వుంటే యిక్కడొక రెండు మూడు రోజులుండి తోట కోత పని చూడమని బళ్లారినుంచి టెలిగ్రామిచ్చినాడు మా నాయన. మా రెడ్డెప్పన్నకు భలే ఆత్రం. వుండే దాంతో తృప్తిపడాలిగానీ, లేనిదాని కొసరం వెంపర్లాడితే యేం లాభం? వొళ్లెరగకుండా పరిగెత్తితే యేమయితింది? వొళ్లు వశం తప్పితింది. రెండేళ్లకు ముందొకసారి ఆలోచన చేసీ చేసీ నరాలు దెబ్బతిని బెంగుళూరు నిమ్హాన్సులో అడ్మిటయినాడు. అయినా తప్పు తెలిసి రాలేదు. చెరుకు తోటలో నష్టమొచ్చినప్పుడు గుబులు పెట్టుకొని రోగాన్ని తిరగబెట్టుకున్నాడు. తిరుపతి రుయా ఆస్పత్రిలో నెలదినాలున్నాడు. డిశ్చార్జీ అయి వచ్చీ రాగానే తోటలోకొచ్చి కావిలి పని మొదులుపెట్టినాడు. మొన్న గంగ జాతరప్పుడు పెద్ద గాలీవానా వచ్చింది. వడగండ్లు పడి సగం కాయలు పనికిరాకుండా పోయినాయి. వొద్దని చెప్పినా వినకుండా తోటలోనే పిచ్చోడి మాదిరిగా వెంపర్లాడి వుపద్రం కొని తెచ్చుకున్నాడు. ఆస్పత్రినుంచీ వచ్చి రెండు వారాలయినా కాకముందే మళ్లా తిరుపతి సిమ్స్‌లో జాయినైనాడు. అదేదో నరాల రోగమని డాక్టర్లు తేల్చి చెప్పి వారమయింది. మా పెద్దన్న కువాయిట్ నుంచి వచ్చినాడు గదా! వొక నాలుగైదు నెలలైనా పెండ్లాం, బిడ్డలతో కాలం గడుపుకుంటే యేమి చెప్పండి? దుడ్డేమయినా తింటావా! సంపాయించి సంపాయించి నెత్తినేసుకుని పోబోతావా! షార్జాకు వీసా

సంపాయించుకునే దానికి బొంబాయికి పోయినోడు పోయినట్టుగానే వుంది. నెలైపోయింది. పాకాలకు మా వదినకైనా జాబు రాయలేదని ఆమె దిగులు పెట్టుకునేసింది. నాకేమో పనులన్నీ వొదిలిపెట్టుకోని యీ వూరికి రమ్మని ఆర్డరేసినారు''

పెద్ద కుక్కొకటి బిగ్గరగా మొరుగుతూ లారీ దగ్గరికొచ్చింది. పిల్లల చేతుల్లో కాలు విరుచుకున్న కుక్కపిల్ల మరింతగా బిగ్గరగా అరుస్తూ తల్లి దగ్గరకు పరుగెత్తింది. పెద్ద కుక్క ఆకారాన్ని చూసి భయపడి వెనక్కు తగ్గిన పిల్లలిద్దరూ మట్టి గడ్డల్ని తీసి వాటిపైన విసరసాగారు.

''యీ వూరికొచ్చి మూడు దినాలైంది. మొన్నంతా కోత లోళ్లు దొరక్క పనిగాలేదు. నిన్న మధ్యాహ్నం మొదులుపెట్టి యీ పొద్దు పదకొండు గంటలకు కోత పని ముగించినారు. మామూలుగా యిరవై టన్నులయ్యేది. యీసారి అయిదు టన్నులకే బ్రహ్మాండమైపోయింది. లారీ కెత్తించి టార్పాలిన్ కట్టినాక చూస్తే టైరు పంచరయింది. స్టెప్నీ గూడా తెచ్చుకోలేదా డ్రైవరు. క్లీనరు గూడా లేడు. నన్నిక్కడ లారీకి కాపలా బెట్టి స్టెప్నీ తెచ్చేదానికి పేటకు పోయినాడు డ్రైవరు''

గాలి తెరొకటి వేడి దుమ్మును రేపుకుంటూ తోటనంతా పరామర్శిస్తోంది. యెండ దెబ్బకు చెట్లలో దలదాచుకున్న కాకుల గుంపొకటి కావుకావుమంటూ గాలిలో కెగిరింది. చినిగిపోయి పాత పీలికల్ని బయటపెడుతున్న దిండును జరిపి, మంచంపైన పడుకున్నాడు స్వామి. పిల్లలు మంచం చుట్టూ పరుగెడుతూ దాగుడుమూతలాడసాగారు. వాళ్లను పట్టించుకోనట్టుగా స్వామి కళ్లు మూసుకుని, ''నీ మాదిరి తెలివయినోళ్లు తక్కువగా వుంటారు. యింకా పైకి చదివి యింకా పెద్ద వుద్యోగం సంపాదించుకోనుండగూడదా, నాయనా!'' అని అడిగాడు.

''చదవాల్సిన చదువునంత చదివేసినాను. మైనస్ యిరవై డిగ్రీల దగ్గర పదార్థాల స్వభావం. అదీ పీహెచ్డీలో నా టాపిక్. యిప్పుడు చేస్తా వుండే క్లర్కు వుద్యోగానికి పదో తరగతి చదివి కూడికలు, తీసివేతలు తెలిసిన పిల్లకాయ చాలు. యెవురో చెప్పిన సలహా విని అరకొర మనసుతో రాసిన గ్రూప్ త్రీలో సెలక్టయినాను. మా ఫ్రెండ్సు కొందరైతే బస్సు కండక్టర్లుగా గూడా వుండారు. యీ మధ్యనే మా ఆఫీసులో కొత్తగా వొకామె వుద్యోగంలో చేరింది. బియ్యే థర్డ్‌క్లాసు. వాళ్లాయన పెద్ద యింజనీరు. రోజూ గవర్నమెంటు జీపులో వచ్చి పోతుంది. పని చెయ్యదు. మా ఇద్దరికీ జీతంలో పెద్ద తేడా లేదు. నాకింకా సెకండ్‌హ్యాండ్ స్కూటరే గతి. మా ఫ్రెండొకరు వేరే ఆఫీసులో గుమస్తా. పై ఆదాయం వద్దంటే వస్తుంది. పెద్ద పాలస్ మాదిరి ఇల్లు కట్టినాడు. నేనింకా అద్దె కొంపలో పడున్నాను. చదువుకూ, బతుక్కూ సంబంధం లేదండీ! ఆ ఆఫీసులో పనిచేసినా, చెయ్యకపోయినా వొకటే! బయటేదైనా వ్యాపారం మొదలుపెట్టితేగానీ పదిమందిలో చెలాయించుకోలేని రాలేము. ప్రతి చిన్న పనికీ యెవుడో వొక చోటా లీడరు కాళ్లు పట్టుకోవాల. వాళ్లు చెయ్యి పెట్టని తావు లేదు. రూల్సూ గీల్సూ దొంగల్దోలేసి చానా రోజులైపోయింది. మూడేండ్ల కొకసారి ట్రాన్స్‌ఫర్లు, సర్వీసును బట్టి ప్రమోషన్లు, అంతెందుకు సంవత్సరమవతానే

యింక్రిమెంట్లూ - యివంతా దుడ్డూ, పవరూ వుండేవాళ్లకే! మిగిలినోళ్లంతా అఘోరించాల్సిందే!''

లారీ డ్రైవరు సీటు దగ్గర దొరికిన నీళ్లసీసాతో పిల్లలిద్దరూ వొళ్లు తడుపుకుంటున్నారు. మాట్లాడుతూనే పిల్లల దగ్గరికి నడిచి బలవంతంగా సీసా లాక్కుని గుక్కెడు నీళ్లతో గొంతు తడుపుకున్నాడు రామచంద్రయ్య.

''నా నీళ్లన్నీ తాగేసినావు!'' అంటూ చిన్న కుర్రాడు మట్టిలో పడి దొర్లసాగాడు. పెద్దవాడు తండ్రి దగ్గరనుంచి సీసా లాక్కుని దూరంగా పరుగెత్తసాగాడు. చిన్నవాడు పైకి లేచి వాడి వెనకే దౌడు తీశాడు.

''మా సోనీ చానా క్లవర్!'' కనురెప్ప లెగరేసి, నవ్వుతూ మంచం దగ్గరి కొచ్చాడు రామచంద్రయ్య. ''యీ కాలంలో పిల్లకాయలు మెత్తగా, నెమ్మదిగా వుంటే లాభం లేదు. యిప్పుడు యెవుడి దగ్గర బలముంటే వాడిదే రాజ్యం. చెయ్యి నోరూ బలంగా వుంటే చాలు. పిల్లలిద్దర్నీ కరాటేకి గూడా పంపిస్తా వుండాను. యిప్పుడే వాళ్ల క్లాసులో వీళ్లను చూస్తే అందరికీ హడల్! అసలు మా నాయన పెంపకంలోనే తప్పుండాదండీ! ఆయనకు మొదటినుంచీ నేనంటే అక్కర తక్కువ. చిన్నా చితకా వుద్యోగాలకు మా పెద్దన్నను పంపించననేసినాడు. ఆయనకేమో దర్జాగా గల్ఫ్‌కు పొయ్యి చేతినిండా సంపాయించుకుంటా వుంటాడు. పెద్ద చదువు చదివాననైనా లేకుండా చిన్న వుద్యోగానికే నన్ను పంపించేసినాడు. చిన్నన్నకు మొత్తం భూమినంతా అప్పజెప్పేసినాడు. యిదే నేను సేద్యంలోకి దిగుంటే యీ పాటికి పెద్ద మిద్దె గట్టేసి వుందును. యీ పల్లెలో యెవుడు పోటీ పడతాడు? యెవుడికి వాడే రజుగదా! అదే టవున్లో అయితే, యెందురు పోటీ? వీధి వీధికీ యెన్ని వ్యాపారాలు! యెందురి కాళ్లు పట్టుకోవాల, యెందురి చెయ్యి తడపాల? నువ్వూ, నీ వుద్యోగమూ అని కాలక్షేపం చేస్తే పైసా మిగలపెడతావా? యిప్పుడే యిట్లుండాది. యింకో యిరవై సంవత్సరాలయినాక, పెద్దవాళ్లయినాక యీ పిల్లలెట్ల బతకతారు? వుద్యోగాలొచ్చే ఆశ యిప్పుడునన్న వాళ్లకే లేదు. వీళ్లకేది దోవ? అందుకే నా శక్తి అయినంత సంపాయించి పెట్టాలనుకుంటా వుండాను.''

నీళ్లయిపోయిన సీసాని లారీ బాడీపైన పగలగొట్టి, గాజు పెంకుల్ని చేత బట్టుకుని వొకరి నొకరు తరుముకుంటున్నారు పిల్లలిద్దరూ. కాస్సేపు ఆలోచించి, తల తిప్పుతూ, ''వ్యాపారాల్లో సంపాదించినట్టుగా వ్యవసాయంలో గిట్టుబాటవుదులే!'' అన్నాడు స్వామి.

''వ్యాపారాల్లో కూడా లక్కుండాలండీ! పదేండ్లకు ముందు బైలరు ముందు నిలబడ టీలు కలపతా వున్నాడు రామనాథ నాయుడు. యిప్పుడు వూళ్లో పెద్ద లాడ్జీ వోనరు. పదైదేండ్లకు ముందు బస్టాండు వెనక పక్క దొంగతనంగా సారా బుడ్లు అమ్మతా వున్నాడు రమాకాంతరెడ్డి. యిప్పుడు పెద్ద హోల్‌సేల్ మర్చంటు. కాలం కలిసొస్తే దుడ్డు తోసుకొని వస్తది. గోల్‌మాల్ చేసే తెలివీ, రిస్కు తీసుకునే తెంపరితనమూ వుంటే చాలు. కొంచెం బాకింగ్ వుండాల. మన పేరు మీద పదెకరాల భూస్థితి వుంటే ధైర్యంగా వుంటింది. చూస్తా వుండాను. ఎట్లయిన ఒక మామిడి తోట కొని పెట్టుకోవాలనుకుంటా వుండాను.

యెప్పుడైనా అర్జెంటుగా రొక్కం గావాలంటే తోటను అడమానం పెట్టొచ్చు. అప్పిచ్చే వాళ్లను గూడా భూస్వామికైతే సందేహించకుండా యిస్తారు. అందుకే యెంత వ్యాపారస్తుడికైనా కొంచెం భూవుండాలి!'' చుట్టూ బొంగరంగా తలతిప్పి మామిడి తోటను కలయజూస్తున్నాడు రామచంద్రయ్య.

''బ్యాంకులో కావల్సినంత డిపాజిట్లూ, లక్షల పైన టర్నోవరుండే బిజినెస్సూ, షేర్లూ, తిరగాలంటే కారూ...'' రామచంద్రయ్య చూపులు పిల్లల శరీరాలమీదుగా పాకి మామిడితోటను ప్రదక్షిణం చేసి, కణకణా మెరుస్తున్న యెండగుండా దూసుకుపోయి ఆకాశపు అంచుదాకా ప్రసరిస్తున్నాయి. పెదవులు తడుపుకుని, ''ఆ మాత్రం లేకుండా టౌన్లలో బతుకు కష్టం! మనమూ మనుషులే అని అందురూ అనుకోవాలంటే ఆ మాత్రమైనా సంపాయించక తప్పదు'' అన్నాడు.

పెద్ద పిల్లవాడు తండ్రి చెవి దగ్గర కొచ్చి యేదో గొణుగుతున్నాడు. రామచంద్రయ్య మెల్లగా పైకి లేచి లారీ దగ్గరికి నడిచాడు. వెనక టైరు దగ్గరికి వెళ్లి చుట్టూ తిరిగి చూసి, ''యిదేనా?'' అని ప్రశ్నించాడు. పిల్లలిద్దరూ తల వూపారు. రామచంద్రయ్య సఫారు లోపల కాస్సేపు తచ్చాడి, కత్తి పట్టుకుని బయటికొచ్చాడు. ''మా చిన్నోడు భలే ఇంటిలిజంటు. మంచికి మంచీ, చెడ్డకు చెడ్డా! వాడేదైనా అనుకుంటే దానికి తిరుగులేదు. ఆ లారీ డ్రైవరు వచ్చినప్పటినుంచీ లా పాయింట్లు మాట్లాడతావున్నాడు. కోత లోళ్లను చెందనియ్యలేదు. వీడెప్పుడో సందు చూసుకోని బాక్ టైర్లో చీల దించేసినాడు. వాడు రాకముందే దాన్ని లాగి పారేస్తాను. చూసినాడంటే నోరు గొట్టుకుంటాడు!'' పెద్దగా నవ్వుకుంటూ లారీ వైపు వెళ్లాడతను.

గబాలున పైకి లేవబోయాడు స్వామి. యేదో అడ్డు తగలడంతో అలాగే వెనక్కి వాలిపోయాడు. ఆయన కాషాయంబర మంచం కోడు దగ్గర ముడిపెట్టి వుంది. పిల్లలవైపు చూశాడతను. వాళ్లిద్దరూ రాళ్లు చేతి కెత్తుకుని లారీ చెక్కలపైన గీతలు గీస్తున్నారు.

వెళ్లొస్తాననయినా చెప్పకుండా స్వామి తోటలోంచి వెలుపలికి నడిచాడు.

పిల్లలిద్దరూ అరుస్తూనే వున్నారు. అప్పుడప్పుడూ వాళ్ల నాన్న గొంతు కూడా వినిపిస్తోంది.

తోట పైకి మోహరించిన శత్రు సైన్యాల్లా సూర్యకిరణాలు భగభగలాడుతున్నాయి.

పెద్ద ఆకుపచ్చని పళ్లెంలా కనిపిస్తున్న మామిడి తోట అంచుల్లో రాళ్ల గుట్టలు రెండూ తలలు తెగి కిందపడ్డ జంతువుల్లా వికృతంగా కనిపిస్తున్నాయి.

## 4

సూర్యుడు ఆకాశపు పడమటి సగంలోకి ప్రవేశించి చాలా సేపయిపోయింది. కానీ యెండమాత్రం మిట్టమధ్యాహ్నపు యెండలా మండిపడుతూనే వుంది.

మామిడితోటను పరివేష్టించిన గుట్టలు రెండూ పచ్చని చేలపై వాలిన పావురాల్లా

అమాయకంగా కనిపిస్తున్నాయి. సానువుల్దాకా వ్యాపించిన మామిడి తోట మట్టి గుట్టల రాక కోసం పరిచిన పచ్చ తివాచీలా కనిపిస్తోంది.

పరధ్యానంగా ముళ్ల కంచె దాటి, మామిడి చెట్ల నడుమ నుంచి మెల్లగా నడుచుకుంటూ తోటలో కొచ్చిన విమల ప్రకాశానందస్వామి వులిక్కిపడి అలాగే ఆగిపోయాడు.

విరిగిన మామిడి కొమ్మపై కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్న వ్యక్తి కూడా పొగ వదిలిపెట్టడం సైతం మరచిపోయి స్థాణువులా వుండిపోయాడు. సముద్రం వొడ్డుకు కొట్టుకొచ్చిన తాటి దోనెలా నల్లగా నొక్కులు పడ్డ ఆకారం అతడిది. తలపై మిగలిన కొద్దిపాటి తెల్ల జుట్టు చెమటతో తడిసి శరీరాని కంటుకుపోయి వుంది. మాసి, గుండీ లూడిపోయిన చొక్కా తొడుక్కున్నాడు. కట్టుకున్న పాత నేత పంచె పైన గ్రీసు మరకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఘాటుగా సోకిన కిరసనాయిలు వాసనను వెంబడిస్తూ చూపులు సారించాడు స్వామి. పది బారల దూరంలో పెద్ద ఎనుబోతులాంటి పాత జావా మోటారు బైకు కనిపించింది.

వెనక్కి తిరిగి వెళ్లిపోవాలో, లేక ముందుకు నడవాలో తోచక స్వామి కంగారుపడి పోసాగాడు.

వేళ్లు చురుక్కుమన్న తర్వాత సిగరెట్టు పీకను అవతలికి విసిరేసి, యెవరు ముందు మాట్లాడుతారోనని పందెం వేసుకున్న వాడిలా అతను కూడా గ్రుక్కిళ్లు మింగసాగాడు.

తల అటూ యిటూ తిప్పి చూసి, చుట్టుపక్కలెక్కడా మరో మనిషి పొలకువ లేదని తేల్చుకున్న తర్వాత తెచ్చి పెట్టుకున్న దగ్గొకటి దగ్గాడు స్వామి.

మరో సిగరెట్టు వెలిగించుకుంటూ, ఇక తప్పదన్నట్టుగా ''రా రా, చిన్నబ్బా!'' అని పిలిచాడతను.

స్వామి అతడి కెదురుగా రచ్చలా అమర్చిన రాతి పలకపైన కూర్చున్నాడు. ఎంత వారిస్తున్నా ఆగకుండా చిరునవ్వొకటి అతడి పెదవుల్లోంచి తొంగి చూసింది.

అతడి నవ్వుని చూడగానే యెదుటి వ్యక్తి మరింతగా ముఖం చిట్లించుకుని, గొణుక్కుంటూ లెక్కవేసి ''నలభై మూడేండ్లు... నువ్వు యిల్లొదిలిపెట్టి పోయి నలభై మూడేండ్లయి పోయింది'' అన్నాడు.

స్వామి తల వూపాడు.

వొళ్లంతా కళ్లు చేసుకుని స్వామిని కాసేపు మౌనంగా చూస్తూ వుండిపోయిన తర్వాత అతను ''యెన్నాళ్ల సంగతి? యెన్ని మార్పులొచ్చినాయి? నాకు బిడ్డలు కలిగి, వాళ్లూ పెద్దోళ్లయి, వాళ్లకూ బిడ్డలు పుట్టి, నేను తాత గూడా అయిపోయి చానా సంవత్సరాలయి పోయింది. యిన్నేండ్లయి పోయినాక... యిప్పుడు కనిపిస్తా వుండావు. నేనీ వూరికొచ్చి పది దినాలయిపోయింది. యింటికాడ కొచ్చి మూతయినా చూపించకుండా పోయినావు, కన్నతల్లి పోయినప్పుడే యింటికి రాకపోయినోడివి. నిన్నేమని అడిగేది? నీతో యేమని

మాట్లాడేదిరా చిన్నబ్బా!'' అన్నాడు జీరబోయిన గొంతుకతో.

''నేనొచ్చినట్టుగా నీకు జాబేసినారు కదా! నే నీ చిదంబరాశ్రమాకొచ్చి మూడు నెలలు దాటింది. బళ్లారిలో కొత్తగా వ్యాపారం పెట్టినావా?'' వొకదానికొకటి సంబంధం లేని మాటలు మాట్లాడాడు స్వామి.

''కొత్తగా యేమీ గాదులే!'' చూపులు మరల్చుకుంటూ చెప్పసాగాడు - ''యిరవై యేండ్లయి పోయింది.వొకప్పుడు ఈ పల్లెల్లో యెక్కడైనా వెంకట సిద్దయ్యంటే యెవురికి తెలుసు? యిప్పుడు యీ పల్లెల్లో యెక్కడైనా వెంకటసిద్దయ్య మండీ అంటే తెలియనోడు లేడు.'' పెద్దగా నిట్టూర్చాడతను. ''అయినా వొక రకం చూస్తే నీ పనే మేలుగా వుందిరా, చిన్నబ్బా! యెన్ని పాట్లు బడినా యీ జానెడు కడుపు కోసరమే గదా! దీని కోసరం యింత ఆరాటం యెందుకు? పెండ్లీ, పెండ్లామూ, బిడ్డలూ, యీ జంజాటాలన్నీ వొదిలిపెట్టి యెక్కడికైనా దూరంగా పారిపోదామనే వుంటాది నాగ్గూడా! అయినా మాట్లాడినంత సునాయాసంగా పారిపోయే దానికి కుదరదు. తిరగాల్సినంత తిరిగేసుంటావు. చూడాల్సినంత దేశం చూసేసుంటావు. చిన్నప్పుడే చానా తెలుసుకున్నావురా చిన్నబ్బా నువ్వు! యీ భూమిన్నమ్ముకుంటే వొరిగేది లేదని కనిపెట్టేస్తివి. అదునులో వానలు పడవు. సరిగ్గా పంట చేతికి రాదు. వచ్చినా గిట్టుబాటు రేటు పలకదు. అదృష్టవశాత్తు నా మాదిరిగా చదువంటలేదు. సేద్యం పనికి రాలేదు. సన్యాసంలోకి దూకేస్తివి. జంజాటం లేని బతుకు. తిండి కూర్చున్న తావుకే ఎతుక్కుంటా వస్తింది. చిల్లర మల్లర కోరికలుంటే తీరేదానికి రకరకాల దోవలుండనే వుండాయి. కొంచెం ధైర్యం చేసినావు. బతుకంతా సుఖపడి పోయినావు. సంసారంలో వుండే సుఖమేందో సన్యాసంలోకి పోకముందే తెలుసుకునేస్తివి. నీమీద కోపం లేదురా, చిన్నబ్బా! నిజంగానే అంటా వుండాను. నీ మాదిరి ధైర్యం యెందురి కుంటింది?''

''వైరాగ్యం అందరికీ వొంటబట్టదు'' బింకంగా అడ్డు తగిలాడు స్వామి. ''సన్యాసమంటే వూరికే తినేసి నిద్రపొయ్యేది గాదు. తపస్సంటే సామాన్యం గాదు. సిద్ధి పొందేటప్పుడు గురువు పెట్టే పరీక్షలు తట్టుకొని నిలబడేది అందరివల్లా అయ్యే పని గాదు!''

''నీకుండే వోపికెంతో నాకు తెలియదారా చిన్నబ్బా!'' వెంకట సిద్దయ్య నవ్వేశాడు. ''నాలుగేండ్లు వరసగా వానలు పడక పంట సరిగ్గా చేతికి రాకపోతే మన సొదిలేస్తివి. పోరంబోకు తిరుగుళ్లు తిరగతా వుండావని రెండు మాటలనిందని కన్న తల్లి పైన్నే మనసిరిచుకుంటివి. సంపాదన లేని మనిషిని యెవురూ లెక్కబెట్టలేదని అయినోళ్లందరినీ వదులుకునేస్తివి...'' కాస్సేపాగి మళ్లీ చెప్పసాగాడు వెంకట సిద్దయ్య - ''నిన్ను యెగతాళి చేస్తా వుండాననుకోవద్దు. యిన్నేండ్లూ బతికి, యింత బతుకు కండ్ల జూసినాక యింకొకర్ని యెగతాళి జేసే గరివెవుడుంటాడు? వోడు వోడని అంతా వోడనే రకం గాదు నేను. నిన్ను నమ్ముకొని పైరు జేసిన పంట యెండబెట్టేసి, యెవురికీ మాట మాత్రమైనా చెప్పకుండా మాయమైపోయినప్పుడు నాకు మొదట్లో కోపమే వచ్చింది. కొన్ని దినాలయినాక అదేదో ఆశ్రమంలో చేరిపోయినావని చెప్పినప్పుడు పీడా వొదిలి పొయిందనుకుంటిని. అయితే

దినాలు జరగనూ జరగనూ అప్పుడు నువ్వు చేసిన పని తప్పుగాదని తెలిసొచ్చింది''

''నువ్వు చెప్పే దాంట్లో గూడా నిజముందిలే! సాములోగ్గూడా కొందరు దొంగ సాములుంటారు'' అంటూ నెమ్మదిగా మొదలెట్టాడు స్వామి. ''బీహారులో వొకాశ్రమంలో అయిదేండ్లుంటిని. పెద్దస్వామి పరమపదం చేరగానే చిన్నసాములు వొకరితో వొకరు పోటీలు పడి తన్నుకున్నారు. అది నా తావు గాదని తెలిసిపోయింది. అప్పటినుంచి యే ఆశ్రమంలో గానీ పట్టుమని రెండేండ్లు వుండలేకపోతిని. గండిలో మాత్రం మంచి గురువే దొరికినాడు. ఆయన అనంతరం ఆశ్రమానికి నేనే గురువని ఆయన వారసత్వ పూజ గూడా చెయ్యించినాడు. కానీ ఆయన పోతానే స్వాములు కొందురు గూడుపుటానీ జేసి నన్ను పక్కన బెట్టేసినారు. యిప్పుడీ చిదంబరాశ్రమానికొస్తే యిక్కడా లక్ష గొడవలు!''

''నాకంటే నువ్వెంతో మేలని చెప్పినాను గదరా, చిన్నబ్బా!'' వెంకట సిద్దయ్య పెద్దగా నిట్టూర్చాడు. ''యిరవయ్యేండ్లు యింకో పని పెట్టుకోకుండా పిల్లకాయలకు పాఠాలు చెప్పినాను. యీ పక్కనుండే హైస్కూళ్లల్లో నా అంత మంచి టీచరు లేదని పేరెత్తినాను. మొదుట్లో పెద్ద పెద్ద వుద్యోగాలు జేసే పిల్లలొచ్చి అంతా మీ ఆశీర్వాదం సార్!'' అంటే గర్వంగా మిడిసిపోయినాను. కానీ చూస్తా వుండగానే కాలం మారిపోయింది. బాగా చదువుకునే పిల్లకాయలు సక్రమంగా వుద్యోగాలు రాక డీలా పడిపోయిరి. చదువొచ్చి వుద్యోగాలొచ్చిన పిల్లలు గూడా చదువుల్రాని లిటిగెంటు నాయకులకు గులాములైపోయిరి. చదువుకూ, ఆదాయానికీ, గౌరవానికీ సంబంధం లేకుండా పోయింది. పదో తరగతి పాసు గాలేని పెద్దవోడు యిప్పుడు పెద్ద మనిషి. వూళ్లో యేం పని చెయ్యాలన్నా చదువుకున్నోళ్లు గూడా వాని దగ్గరికే పోవాల. స్టూడెంటు యెలక్షన్లలో వోడిపోయిన కొంటగాలం పిలకాయ యిప్పుడు పెద్ద పొలిటీషియను. నా దగ్గిర చెంపదెబ్బ తిన్నోళ్ల దగ్గర నేనే తలదించుకోని ప్రాధేయపడాల్సి వచ్చింది. వోనమాలు రాని మనుషులు కార్లూ, జీపుల్లో తిరగతా వుంటే బాగా చదువొచ్చినోళ్లు పిచ్చిబట్టి రోడ్లపైన పడినారు. చూస్తా భరాయించుకోలేకపోయినాను. వుద్యోగం మింద శ్రద్ధ తగ్గిపోయింది. యెట్ల సంపాదించినావు అనేది గాదు ముఖ్యం, యెంత సంపాదించినావు అనేదే ముఖ్యమని తెలుసుకున్నాను. మెల్లింగా మామిడి కాయల వ్యాపారంలోకి దిగినాను. నా స్టూడెంట్లతోనే పోటీకి తయారైనాను. అదేమీ బ్రహ్మవిద్యగాదు. కానీ మొదులు మొదుల్లో పెద్దగా పోటీలేని వ్యాపారం యిది. అందురూ యేడెనిమిదేండ్లకు తోటల్ని అడమాణం పెట్టుకోని బాగా సంపాదించేసినారు. వాళ్లకిప్పుడు కొంచెం అటు యిటైనా పెద్దగా దెబ్బ తగలదు. కానీ కొత్తగా వ్యాపారాల్లోకి వచ్చినోళ్లకు అన్నీ యిబ్బందులే! యేటి కెదురీదినట్లుగా యీ యిరవైయ్యేండ్లుగా కష్టపడి యీ వ్యాపారాన్ని వొక దోవకు తెచ్చినాను. యింకా కొంచెం పనుండాది''

మట్టి బాట పైన దుమ్ము రేపుకుంటూ డబ్బారేకుల బస్సొకటి ముక్కుతూ మూల్గుతూ పరిగెడుతోంది. యెక్కడో నేలమీద ఆహారం కనిపించడంతో పెద్ద గద్దొకటి తోటపైన గిరికీలుకొడుతోంది. తోట కటువైపున కుక్కల సంరంభం మిన్నుముట్టుతోంది.

''వుద్యోగం నుంచీ రిటైరైనాక గూడా రెస్టు తీసుకోకుండా వ్యాపారంలోకి దిగినావు.

చేసినంత కాలం చేసినావు. యింకీ పనులు పిలకాయల చేతిలో పెట్టేసి కృష్ణారామా అనుకోకూడదా?'' అన్నాడు స్వామి.

వెర్రివాడిని చూసినట్టుగా చూస్తూ, వో నవ్వు నవ్వి, ''నా కొడుకుల సంగతి చెప్పు. వొకొకనిదీ వొకో దోవ. దుర్మార్గులు కాదు. బుద్ధిమంతులవునో, గాదో చెప్పలేను. పొరబాటు యెక్కడ జరిగిందో, యెవ్వరు చేసినారో నాకు తెలియదు'' అన్నాడు వెంకటసిద్దయ్య. అతడి ముఖం మరింతగా ముడుచుకుపోసాగింది. కనురెప్పలు సాగాయి. నుదుటిపైన చెమట బిందువులు కదిలాయి. పెదవులు వణకసాగాయి. ''యీ చేత్తో వొకే మాదిరిగా చదువు చెప్పించినాను. యెందుకు వొకడు పైకి పోయినాడో, యెందుకొకడు వెనకబడి పోయినాడో నాకు అంతుబట్టలేదు. తెలియకుండా యేదో దోవలో పోతే నక్క తోక తొక్కినోడొకడు. యెంతో జాగ్రత్తగా ముందు కడుగేసినా అడుసు తొక్కినోడొకడు. యిదంతా కప్పల తక్కి మాదిరి వ్యవహారం. తెలివి తేటలకూ, జీవనానికి సంబంధం లేదు. చేసే పనికీ, కష్టానికీ, ఫలితానికీ సంబంధం లేదు. యిదంతా పిచ్చోడి చేతిలో గీతల మాదిరి అవకతవకల యవ్వారం!'' కాస్సేపాగి మళ్లీ చెప్పసాగాడతను - ''ముగ్గురిలోనూ తెలివైనోడు నడిపోడే! అందరికంటే బాగా చదివినాడు. వానికెందుకో వుద్యోగమే రాలేదు. పోనీలే వ్యాపారంలో దిగరా అంటే వాడు వినలేదు. యేదేదో పుస్తకాలు చదివి యీ గోచి పాతంత భూమిని రకరకాలుగా మచ్చిక జేసుకోవాలని అనుకున్నాడు. యెందుకో వొకటీ కలిసి రాలేదు. మిగిలిన ఇద్దరితోనూ పోలిస్తే చిన్నోడు అంత తెలివైనోడేమీ గాదు. కానీ వాని రాతే బాగుండాది. యంత సంపాదించుకుంటాడు. చాలని దానికి వాని పెండ్లాం గూడా వుద్యోగం చేస్తా వుంది. కానీ మా పెద్దోడు గారెంటీగా పెద్ద ఆఫీసరవుతాడని నమ్మకంగా వుంటిని. డ్రైవరుగా పనిచెయ్యాలనీ, పెండ్లాం బిడ్డల్ని వదిలి పెట్టి దేశాలబట్టి పోవాలనీ వానికి రాసిపెట్టుంటే నేనేం చేసేది?''

''దిక్కూ దరీ లేని మనుషులు మాదిరి వాళ్లు తలో దిక్కూ యెందుకు పోవాల? వ్యాపారంలో నువ్వు సంపాదించిందంతా వాళ్లకే గదా! యింక దిగులెందుకు?'' కాషాయాంబరంలోకి దూరిన గండుచీమల్ని విదిలించుకుంటూ అడిగాడు స్వామి.

''నేనంటే గానీ, నా వ్యాపారమంటే గానీ వాళ్లకు లెక్క లేదు. నేనే వాళ్ల దోవకు పోవాలని అనుకుంటారు గానీ చిన్నా పెద్దా యెంచే వాళ్లు గాదు. పగులనకా, రేత్రనకా కష్టపడి నేను సంపాదించిందంతా వాళ్లకు పంచి యిచ్చేసి నేనూ, నా పెండ్లామూ యేదైనా అడివి దోవ చూసుకుంటే వాళ్ల కానందం. రిటైరైనాక వచ్చిన దుడ్డంతా వ్యాపారంలో పెట్టేసినానని నాపైన కోపం. సంవత్సరానికొక తడవ ఆడబిడ్డలకు గుడ్డా గుసురూ తీసిస్తా వుండానని మంట. చూస్తా వుండు. వీళ్లకంతా సరిగ్గా బుద్ధి చెప్పేదాకా యీ వ్యాపారం వదిలిపెట్టేది లేదు!'' వెంకట సిద్దయ్య పిడికిళ్లు బిగుసుకున్నాయి. అప్పటికప్పుడు గాలి నింపిన టైరులా నిటారుగా కూర్చున్నాడతను. ''యీ పక్క తోటల్లో అంతగా గిట్టుబాటు గాలేదని బళ్లారి పక్కకు పోయినానీ తడవ. అక్కడ తోటలు అగ్గవగానే దొరికినాయి. హాస్పేటలోనే యిల్లు దీసుకోని, అక్కడ్నే మనుషుల్ని పెట్టి వ్యాపారం చేసినాను.'' కాస్సేపాగి మళ్లీ

కొనసాగించాడు - ''కానీ యెక్కడైనా రూపాయికి పదారణాలే! అంత దూరంనుంచీ లారీల్లో బెంగుళూరుకు సరుకు తోలి, ఆ ఫ్యాక్టరీ వాళ్లకు కమిషన్లిచ్చే కాడికి అంతా ఆయమ్మే అయింది. యీసారి యీ పక్క తోపులే బేరమాడతా వుండాను. వచ్చిన దుడ్డ వచ్చినట్టే తోటలపైన పెట్టేస్తా వుండాను. సక్రమంగా యిల్లు గట్టుకోని, జల్సాగా, బతకగూడదా అని పిల్లకాయలు యెద్దేవా చేస్తా వుండారు. బాగా దుడ్డు వచ్చినాక, మనం గాకపోతే యెవురనుభవిస్తారు? యిప్పుడిప్పుడే కొన్ని తోటలు కుదిరేట్లుండాయి. ఆడోళ్ల బంగారం కొంచెముంది. బ్యాంకులో పెడితే యింకొంచెం దుడ్డు దొరకతాది. యింకొన్ని తోటలు బేరమాడచ్చు'' వెంకటసిద్దయ్య చూపులు గాజు పలకపైన జారే నీటి బిందువుల్లా ఆకాశపు అంచుల్లో తత్తళిస్తున్నాయి.

యిద్దరూ కాస్సేపు అటే చూస్తూ కూర్చున్నారు.

తోట కంచె దగ్గర యెండుటాకుల గలగల వినిపించింది. పైకి రాబోతున్న కుక్కనెవరో అదిలిస్తున్న శబ్దం వినిపించింది.

యిద్దరూ అటువైపుకు తిరిగి చూశారు.

నలిగిన దుస్తులతో, చెదిరిన క్రాఫింగుతో పరుగెత్తీ పరుగెత్తీ అలిసిన గుర్రంలా రొప్పుతూ వచ్చాడు రామచంద్రయ్య.

''యిదేనా రావడం?'' అని పలకరించాడు వెంకటసిద్దయ్య ముక్తసరిగా.

అతను స్వామి వైపు చూసి ముఖం ముడుచుకుంటూ ''యిప్పుడే బస్సు దిగినాను. సాయంత్రం బస్సుకే పోవాల'' అని సమాధానమిచ్చాడు.

''అవున్లే! నీకు పనులెక్కువ. నాకు తెలియదా?'' వెంకటసిద్దయ్య యెగతాళి చేస్తున్నాడో లేక అన్యమనస్కంగా మాట్లాడుతున్నాడో తెలియడం లేదు.

''యిప్పుడైనా వచ్చే తీరిక లేదు. విషయం తెలస్తానే యెక్కడ పనులక్కడ వదిలి పెట్టేసి పరుగెత్తుకొచ్చేసినాను''

కారణమేమిటన్నట్టుగా చేతుల్ని తిప్పుడూ హావభావాల్తోనే ప్రశ్నించాడు వెంకటసిద్దయ్య.

''యీ తోటా, మడీ అమ్మకానికి చెప్పేసినారంట గదా!'' రామచంద్రయ్య యింకా గసబోస్తానే వున్నాడు.

''యెవురు చెప్పినారు?'' తాపీగా అడిగాడు వెంకటసిద్దయ్య.

''యెవురు చెపితే యేముందిలే! ఎట్నో చేతులు కాలకముందే తెలిసింది. ముందే చెప్తా వుండాను. వేరే మూడో మనిషికి అమ్మితే నేనొప్పుకోను. నాకే కావాల్ల. పెద్ద మనుషులెంత మతిం పేస్తే అంతా యిస్తాను''

''మంచిది. బాగా సంపాదించినట్టే వుండావు!'' అదే ధోరణిని కొనసాగించాడు వెంకటసిద్దయ్య.

''యెట్లో వొకట్ల కష్టపడక పోతే తప్పదు గదా!'' నిట్టూర్చాడు రామచంద్రయ్య. ''కండ్ల ముందర్నే తన్నుకోని పోతా వుంటే చూస్తా వుండే నిబ్బరం లేదు నాకు. టౌను బ్యాంకీలో అప్పిస్తారు. జీపిఎఫ్ లోను వస్తాది. అడంగల్ తీసకపోతే బంగారంపైన తక్కువ వడ్డీకి అప్పు బుట్టించవచ్చు. నాలుగైదేండ్లు చేతుల్లో సరిగ్గా దుడ్డాకుండా కటకటబడాల్సి రావచ్చు. అదంతా మీకేల? నా పాట్లు నేను పడతాను!''

కాలచక్రం కాసేపు మెల్లగా కదిలింది.

మామిడి చెట్ల కొనకొమ్మల్లో కాకులెందులో గోల చేస్తున్నాయి.

బొమ్మల్లా కూర్చుండి పోయిన మగ్గురూ పెద్దగా స్కూటరు శబ్దం వినిపించగానే కంగారు పడి తిరిగి చూశారు.

నేరుగా వాళ్లు కూర్చున్న చోటికే వచ్చి ఆగింది స్కూటరు. గంటల తరబడీ ప్రయాణం చేశాడన్నందుకు చిహ్నంగా అతడి జుట్టు గాలివానలో చెదిరిన వరిపైరులా చెల్లాచెదురైపోయి వుంది. ముఖం బాగా డస్సిపోయి వుంది. ఆకులు రాల్చుకున్న చెట్టులా దిగాలుగా వున్న ముఖంలో ముగ్గురినీ మార్చి మార్చి చూసి, స్కూటరు స్టాండు లాగుతూ ''అంతా యిక్కడే జేరి అంతా మీరే నిర్ణయించేసినారా? నా చెవిలో వొక ముక్కేయాలన్న ఆలోచనైనా వొక్కరికీ రాలేదా?'' అంటూ నిష్ఠూరంగానే ప్రారంభించాడు రాజగోపాల్.

''నువ్వు చెప్పేదేం సంగతి నాయనా?'' వెంకట సిద్దయ్య గొంతుకలో కోపమూ, యెగతాళీ కలిసి ధ్వనించాయి.

స్కూటరు పైన అలాగే కూర్చుని, ''తోట అమ్మకం సంగతే! నన్నో మాట అడగకుండా బేరానికి పెట్టేసినారు గదా! ఎవురు చెప్పినారని అడగద్దు. యిట్లాంటి విషయాలు దాచి పెడ్తే దాగతాయా? యెట్లో గాలిపోవిడిగా తెలిసింది. రెండు దినాల్లో ప్రయాణం పెట్టుకోనుండాను. యిప్పటిప్పుడు అమ్మేయాలని యెందుకు బుద్ధి పుట్టింది?'' అని చీకాకు పడసాగాడు రాజగోపాల్.

''షార్జాకు వీసా దొరికిందా?'' అడిగాడు రామచంద్రయ్య.

''షార్జాకు గాదు. యెమన్‌కు పోతా వుండాను. మొన్ననే వీసా యిచ్చినారు. యెక్కడ పనులక్కడ వొదిలిపెట్టేసి వచ్చినాను. గంటలోపల బయల్దేరేయాల! వెయ్యి మాటలొద్దు. ముందే చెప్తావుండాను. తోటంతా నాకే కావాల. వూరికే యేమీ యియ్యద్దండి. పరాయి మనిషి కయితే ఎంతకిస్తారో అంతకే యియ్యండి. దుడ్డు కావాలంటే యిప్పటికిప్పుడు యియ్యలేను. టౌన్లో రెండు ప్లాట్లుండాయి. బేరానికి చెప్పేసినాను. ఆరు నెలల్లో అంతా సర్దేస్తాను''

విన్నంతసేపూ విని, స్వామికేసి తిరిగి, ''చూసినావా చిన్నబ్బా! యిదీ కొడుకుల ప్రతాపమంటే!'' అంటూ పెద్దగా నవ్వేశాడు వెంకట సిద్దయ్య. ''నడిపోడికీ తోపుతో మడితో తల బొప్పిగట్టింది. అయినా అమ్మేయాలని అనుకునిం దానికి అదొక్కటే గాదులే

కారణం. యిది వుమ్మడి సొత్తు. ఎప్పుడైనా భాగాలు పోవాల్సిందే గదా! అమ్మేసి అత్తగారి ప్రాపకంలోకి పోవాలని ఆరాటం. యీ పల్లె కొంపల్లో గాలి వార్తలు యిట్లే పుడతాయి. వొకటి జరిగితే రెండుగా చెప్పుకుంటారు. తండ్రనే మనిషి బతికుండగానే వొక కొడుకు ఆస్తి అమ్మకానికి పెట్టేసినాడు. యిద్దరు కొనేందుకు రెడీ అయిపోయినారు. యిదీ సంసార్ల గతి!''

యెవరూ వులకలేదు, పలకలేదు.

వెంకటసిద్దయ్య మళ్లీ పెదవి కదిపాడు - ''యిది మంచి కాలం గాదు. లేకుంటే పెద్దా చిన్నా లేకుండా పోతిందా? భూమంతా వాని కొకనికే యిచ్చేస్తే యేందో పొడిచేస్తానంటాడు నడిపోడు. యెంత చెప్పినా వినకుండా టమేటో పైరు పెట్టినాడు. చెట్లలో చూడుబోండి! వద్దంటే కాత. చెట్లల్లోనే మాగిపోతా వుండాయి. రేటు డౌను. మొన్ననే ఆస్పత్రినుంచీ వచ్చినాడు. యింకా వొళ్లు పూర్తిగా గుణం గాలేదు. వద్దు వద్దని నెత్తీ నోరు కొట్టుకుంటా వుంటే పట్టించుకోకుండా ట్రాక్టరు కాయలేసుకోని కలికిరికి పోయినాడు''

యెండిపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకున్న తర్వాత అతనే కొనసాగించాడు - ''మామిడికాయల వ్యాపారం చేసే వాళ్లకు సొంత తోపు వుండాల. యీ రెండెకరాల భూమిలోగూడా మామిడి చెట్లు పెట్టేసి పెద్ద తోటగా తీర్చాల. యింకా కొన్ని తోటలు అడమానం పెట్టుకోని, వ్యాపారంలో కొంచెం పట్టు దొరికించుకోవాలని నేను తాపత్రయ పడతా వుండాను. తెల్లారి జామున్న బయల్దేరినోన్ని, యీ బండి పైన్నే ముప్పయి మైళ్లదాకా తిరిగి తోటలన్నీ చూసొస్తా వుండాను. వీళ్ల కథేమో ఇట్లుండాది. యెవురితో చెప్పుకునేట్టుండాది? నగుబాట్లు బతుకయిపోయింది గదా!

కంచెకవతల కుక్కలు పెద్దగా మొరగసాగాయి.

పరిగెత్తుకుంటూ వచ్చాడో యువకుడు.

చెమటోడుతున్న అతని ఆకారం అప్పుడే నీళ్లలోంచీ బయటపడేసిన తాబేలులా నల్లగా నిగనిగలాడుతోంది.

''పెదనాయినా! రెడ్డప్పన్నకు వుళ్లా తిరగబెట్టేసింది. ఆస్పత్రిలో చేర్పించినారు!'' ఆవేదనతో వణుకుతున్న గొంతుకతో దూరంనుంచే బిగ్గరగా అరిచాడతను.

వొక్క వుదుటున లేచి నిల్చుని, ''యేమైందిరా?'' అని ఆక్రోశించాడు వెంకటసిద్దయ్య.

''పొద్దన ట్రాక్టరులో కలికిరికి పోయినాము గదా! మార్కెటు నిండా సరుకే! కేజీ అర్ధరూపాయ. సరుకు కొనే మనిషే కనబడలేదు. యెనక్కు తిరుక్కోని వచ్చేద్దామంటే ట్రాక్టరు బాడిగ దండగ. కాయలు దించే దానికి మార్కెట్టులో తావే దొరకలేదు. చేసేదేమీ లేక కలికిరి చెరువులో ట్రాక్టరు తక్కాళి పండ్లు దిమ్మరించేసి యెనక్కు మళ్లితిమి. యేమైందో ఏమో, పోతా పోతా వుండే ట్రాక్టరులోంచి ధనేల్మని పడిపోయినాడు రెడ్డెప్పన్న. యెనక చక్రం పైకెక్కేసింది!''

''యిప్పుడెట్లుండాదిరా?'' బెంబేలు పడుతూ అడిగాడు రామచంద్రయ్య.

''గవర్మెంటాసుపత్రిలో చేర్పించినారు. పోలీసులొచ్చి పెద్ద గలాటా జేసి డ్రైవర్ను పట్టుకోని పోయినారు. పడిపోలేదు, కావాలనే దూకేసినాడు అంటా వుండాడా డ్రైవరు''

''డాక్టర్లేమంటా వుండార్రా?'' కసురుకున్నాడు రాజగోపాల్.

''కష్టం... కొంచెం కష్టంగా వుండాదన్నారు'' అతను గ్రుక్కిళ్లు మింగసాగాడు. ''యిప్పుడిప్పుడే యే మాటా చెప్పలేమన్నారు. రక్తం చానా పోయిందంట! పెద్దోళ్లని బిన్నాగా ఆస్పత్రి కాడికి రమ్మనారు''

నిలువునా కంపిస్తున్న శరీరంతో మోటారు బైకు స్టాండు లాగాడు వెంకటసిద్దయ్య.

రాజగోపాల్ స్కూటరు స్టార్టు చేశాడు. రామచంద్రయ్య స్కూటరు వెనక సీటు పైన కూర్చున్నాడు.

''మీరు నేరుగా ఆస్పత్రి కాడికే పొండి, పెదనాయినా! నేనొకసారి యింటికి పోయి, రాత్రి బస్సుకు వచ్చేస్తాను'' అన్నాడా యువకుడు.

వాహనాలు రెండూ రోడ్డువైపుకు వురకలెత్తాయి.

తానూ పైకి లేచి నేల కతుక్కుపోయినట్టున్న పాదాలను బలవంతంగా కదిలించాడు స్వామి. పైకి రాబోతున్న యేడుపు నాపుకుంటూ, ''రెడ్డెప్పన్న పొద్దున్నించీ యిష్టమొచ్చినట్టుగా మాట్లాడతా వున్నాడు. యీసారి కోళ్ల ఫారం పెట్టాలనీ, యెన్ని గుడ్లు, యెన్ని పిల్లలవతాయి అనీ లెక్క లేస్తా వున్నాడు. మార్కెట్టుకాడి కొచ్చి నప్పటినుంచీ నోటికి బీగా లేసినట్టుగా గొమ్మునే వుండిపోయినాడు. యిట్లా చేస్తాడని అనుకోలేదు. పెదనాయిన కెట్ల జెప్పేదో తెలియులేదు. డాక్టర్లు చెప్పే దాన్ని బట్టి జూస్తే ఆశలు వదులుకోవాల్సిందే ననిపిస్తా వుండాది!'' అన్నాడు స్వగతంలా.

తోట వెలుపలి కొచ్చాక ''నీదే వూరు నాయనా?'' అని ప్రశ్నించాడు స్వామి.

''పెదనాయనది మా పక్కిల్లే. వాళ్లూ, మేమూ పాలోళ్లం!'' వుద్వేగాన్ని ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ చెప్పాడతను.

''యెవురు యెప్పుడు పోవాలని రాసిపెట్టి వుందో యెవురికి తెలుసు? అంతా మాయ... కర్మ... ప్రారబ్దం, నాయనా!'' అని నెమ్మదిగా చెప్పి, కాస్సేపాగి రహస్యం చెబుతున్నట్టుగా స్వరం తగ్గించి, ''నువ్వు వూరికి పోవాలేమో గదా! నేను ఆశ్రమానికి పోతాను. అయినా ఆశ్రమం అంత దూరంలో వుంటే యేం బాగుంటుంది? అందుకే యిక్కడ్నే వొక ఆశ్రమం స్థాపించాలని సంకల్పం పుట్టింది'' అన్నాడు స్వామి.

అతడి మాటలు అర్థంకాక ''యిక్కడంటే?'' అని బిక్కమొహం పెట్టాడా యువకుడు.

''యీ మామిడి తోటలోనే! భగవత్కార్యం కోసరం కైంకర్యం చేసే దానికి ముందు కొచ్చే భక్తులెందురుండరు? వాళ్లు పూనుకుంటే యిదొక లెక్కలో వుండే పనిగాదు. పైగా వాళ్లు కొనాల్సింది యిందులో సగభాగమే కదా! అంతా గురువాజ్ఞ! మనదేముంది. నిమిత్తమాత్రులం!'' వేదాంతీకరిస్తూ నవ్వి స్వామి ముందుకు కదిలాడు.

బుర్ర గోక్కుంటూ, గ్రుక్కిళ్లు మింగుతూ వూరివైపు తిరిగి నడవసాగాడా యువకుడు.

యెర్రటి ధూళిని రేపుతూ పశువులు వూరివైపు పరిగెడుతున్నాయి. మెల్లగా పరచుకుంటున్న చిరు చీకటి తెరల మధ్య పడమటి ఆకాశంలోని యెర్రని రంగు అప్పుడే చిందిన రక్తంలా మెరుస్తోంది.

దూరంగా మట్టి రోడ్డు మలుపు తిరుగుతున్న చోట, రెండు వాహనాలు రేపిన యెర్రటి దుమ్ము సుళ్లు తిరుగుతోంది.

దోర యెరుపురంగు తెరల మధ్య నీడలా కరిగిపోతూ విమల ప్రకాశానందస్వామి ఆకారం బరువైన వస్తువేదో మెల్లగా దొర్లుతున్నట్టుగా ముందుకు సాగుతోంది.

పెద్ద రాబందులు రెండు నేల మీద వాలినట్టుగా రాళ్ల గుట్టలు రెండూ భీకరంగా మిగిలాయి. వాటి పాదాల దగ్గరి మామిడి తోట ఆకుపచ్చని ఎండమావిలా వూరిస్తూనే వుంది.

*(1, 8, సెప్టెంబర్ '97, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)*